హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ : 18004251442

యాదాద్రి : 1800 425 7106

సూర్యాపేట : 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 60

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.120	180	200
సూర్యాపేట	రూ.105	170	200
నల్లగొండ	రూ.110	180	210

ఉష్ణోగ్రత గరిష్ఠం 36.0 । కనిష్ఠం 21.0

పంటలు ఎండుతున్నయ్

- పది రోజులుగా సాగర్ వరదకాల్వకు నిలిచిన నీటి సరఫరా
- ఇబ్బందులు పడుతున్న రైతులు
- నీటిని విడుదల చేయాలని వేడుకోలు



నారాయణపురంలో నీరందక ఎండిపోతున్న వరి చేను

సాగర్ ప్రాజెక్టు నుంచి వరదకాల్వకు పది రోజులుగా నీటి విడుదల నిలిచింది. సాగర్ జలాశయం 520 అడుగుల నీటిమట్టం ఉన్న సమయంలో జలాశయం నుంచి మోటార్ల ద్వారా వరదకాల్వకు నీటి విడుదల చేస్తారు. సాగర్ జలాశయంలో నీటి మట్టం పడిపోవడంతో నీటి విడుదలను ఈనెల 15న నిలిపివేశారు. దీంతో ఈ నీటి ఆధారంగా పంటలు సాగుచేసిన రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వరి కోతకు వచ్చే సమయంలో నీటి విడుదల నిలిచిపోవడంతో పొలాలు ఎండుముఖం పట్టాయి. - (ఆంధ్రజ్యోతి, మాడ్గులపల్లి)

నాగార్జునసాగర్ నుంచి లోలెవల్ వరద కాల్వ ద్వారా నీటిని అందించేందుకు ప్రభుత్వం ఈ కాల్వను తవ్వింది. వరదకాల్వ పెద్దవూర మండలం పుల్యాతండా వద్ద ప్రారంభమై పెద్దవూర, కనగల్, అనుముల, నిడమనూరు, త్రిపురారం, మాడ్గులపల్లి, వేములపల్లి మండలంలోని మొల్కపట్నం వరకు 85కి.మీ మేర విస్తరించి ఉంది. ఈ కాల్వ కింద సుమారు 50వేల ఎకరాల ఆయకట్టు స్థిరీకరించడంతోపాటు వరదకాల్వ ద్వారా చెరువులను నింపనున్నారు. సాగర్ జలాశయంలో నీరు పుష్కలంగా ఉండడంతో ఈ ఏడాది నీటి విడుదల నిరంతరంగా కొనసాగింది. మండలంలోని కన్నెకల్, నారాయణపురం, కేశవాపురం, దాచారం, చెరువుపల్లి, కుక్కడం, మాడ్గులపల్లి, మర్రిగూడెం, తోపుచర్ల, గండ్రవానిగూడెం, మొల్కపట్నం వరకు కాల్వపై ఆధారపడి రైతులు సుమారు 8వేల ఎకరాల్లో వరి సాగుచేశారు. సాగర్ జలాశయంలో..

మిగతా 8వ పేజీలో...

నాలుగు ఎకరాల పొలం ఎండుతోంది



వరదకాల్వ ఆధారంగా నాలుగు ఎకరాల్లో వరి సాగు చేశా. వరి ప్రస్తుతం పొట్ట దశలో ఉంది. వరదకాల్వ నీటి విడుదల నిలిచిపోవడంతో పంట చేతికొస్తుందో రాదోనని ఆందోళనగా ఉంది. ఎకరాకు రూ.30వేలకు పైగా పెట్టుబడులు పెట్టా. సాగు నీటిని విడుదలచేసి పంటలను కాపాడాలి.

- దేవిరెడ్డి మల్లారెడ్డి, రైతు, మర్రిగూడెం

పదో తరగతి తెలుగు-1 ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారానికి రాజకీయ రంగు పులుముకుంది. ప్రశ్నపత్రం లీకేజీకి కాంగ్రెస్ నాయకులకు సంబంధముందనే సందేశంతో సోషల్‌మీడియాలో దుష్ప్రచారం చేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఆ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ కొణతం దిలీప్, పార్టీ నేత మన్నె క్రిశాంక్, తెలుగు స్క్రైబ్ ఛానల్(వెబ్), టీన్యూస్, తెలుగు మిర్రర్ ఛానల్స్‌పై బుధవారం నకిరేకల్ పోలీస్‌స్టేషన్‌లో వేర్వేరుగా మూడు కేసులు నమోదయ్యాయి. అందులో ఒకటి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద నమోదవడం రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి,నల్లగొండ)



పది ప్రశ్నపత్రం లీకేజీకి.. రాజకీయ రంగు



- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు
- నకిరేకల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన మాజీ సర్పంచ్ నరేందర్
- కేటీఆర్‌తో పాటు, కొణతం దిలీప్, మన్నె క్రిశాంక్‌పై మరో రెండు కేసులు
- తెలుగు స్క్రైబ్, టీన్యూస్ ఛానల్, తెలుగు మిర్రర్ ఛానళ్లపైనా నమోదు

సోషల్‌మీడియా పోస్టులు, రెండు పార్టీల నేతల పరస్పర ఖండనలు బుధవారం జిల్లా అంతా ఈ వ్యవహారంతో ఉడికిపోయింది. ఓ వైపు ఉదయం నుంచే నకిరేకల్ పోలీస్‌స్టేషన్‌లో మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత, మాజీ సర్పంచ్ నకిరేకంటి నరేందర్, మరో నేత ఉగ్గిడి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయగా, మరోవైపు అసెంబ్లీ లాబీల్లో మీడియాతో చిట్‌చాట్‌లో నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ఘాటుగా స్పందించారు. సోషల్ మీడియాలో కోతి రాముళ్లు గోకా, నాకా అన్నట్లు వ్యవహరిస్తున్నారని,తనని కెలకవద్దని హెచ్చరించారు.దళితులంటే వారికి ఈర్ష్య ఉందని,గతంలో వాళ్లకే లీకుల అలవాటుందని,పల్లీ,బఠానీలకు పేపర్లు విక్రయించుకున్న చరిత్ర వారిదేనని వ్యాఖ్యానించారు.చదువు విలువ తనకు తెలుసని,దమ్ముంటే నేరుగా ఎదుర్కోవాలే తప్ప ఆకాశరామన్న ఉత్తరాలతో దుష్ప్రచారం చేయవద్దని హెచ్చరించారు.

సోషల్‌మీడియాలో ప్రచారం చేసినందుకు కేసులు

ఈనెల 21న పదో తరగతి తెలుగు-1 ప్రశ్నపత్రం ఫొటోలు లీకయ్యాయి. నకిరేకల్‌లోని ఎస్సీ గురుకుల పాఠశాలలోని పరీక్షా కేంద్రం నుంచి ఈ ఫొటో తీసినట్టు నిర్ధారించిన పోలీసులు ఈ కేసులో 12మందిని ఇప్పటికే రిమాండ్‌కు తరలించారు. మరొకరు పరారీలో ఉన్నారు. ఈ కేసు విచారణ సాగుతోందని పోలీసులు పేర్కొంటున్నారు. అయితే రెండు రోజుల క్రితం నుంచి ఈ లీక్ వ్యవహారంలో నిందితులైన గుడుకుంట్ల శంకర్, చింట్ల ఆకాశ్, బండి శ్రీనుకు నకిరేకల్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత, మాజీ సర్పంచ్ నరేందర్, మరో నాయకుడు ఉగ్గిడి శ్రీనివాస్‌కు సంబంధాలున్నాయని పేర్కొంటూ తెలుగుస్క్రైబ్ యూట్యూబ్‌ఛానల్ (వెబ్), టీన్యూస్, తెలుగు మిర్రర్ ఛానల్ తదితర సోషల్‌మీడియా వేదికల్లో ప్రసారమైంది. వాటిని నిర్ధారణ చేసుకోకుండా మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఆ పార్టీ సోషల్‌మీడియా విభాగం కన్వీనర్ కొణతం దిలీప్, మరో నాయకుడు మన్నె..

మిగతా 7వ పేజీలో...

కేసు దర్యాప్తునకు ఆటంకం కలుగుతుందనే ఆందోళన

అనూహ్యంగా ప్రశ్నపత్రం కేసుకు రాజకీయరంగు పులుముకోవడంతో దాని ప్రభావం విచారణపై పడే అవకాశముందని సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. ఇప్పటికే 13 మంది నిందితులను గుర్తించిన పోలీసులు వారిలో 12మందిని రిమాండ్‌కు తరలించారు. అయితే ప్రశ్నపత్రం లీక్ ఘటనలో మరింత లోతుగా విచారణ చేయాల్సిన అవసరం ఉంది. రాజకీయనేతల పరస్పర ఆరోపణలను పక్కనబెట్టి నిష్పక్షపాతంగా దర్యాప్తు సాగించాలనే డిమాండ్లు వస్తున్నాయి. పరీక్షా కేంద్రంలోకి నిందితులు వెళ్లడానికి ఎవరెవరు సహకరించారు? నకిరేకల్‌లో ఫొటో తీసిన ప్రశ్నపత్రం శాలిగౌరారంలో సోషల్‌మీడియా గ్రూపుల్లో ఎలా చక్కర్లు కొట్టింది? పేపర్ లీక్‌కు అసలు ప్రయత్నించారా? ప్రయత్నిస్తే వ్యక్తులుగా ఆ ప్రయత్నం చేశారా? లేక ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాల పాత్ర ఎంతవరకు ఉంది? నిందితుల్లో ఉన్న ఒక ప్రైవేట్ స్కూల్ నిర్వాహకుడితో పాటు, ఇంకా ఎవరైనా ఈ లీక్ కోసం పనిచేశారా? గట్టి నిఘా నిర్వహించాల్సిన పోలీస్ యంత్రాంగం ప్రశ్నపత్రం ఫొటో తీసేంతవరకు ఎందుకు అడ్డుకోలేకపోయింది? అనే పలు ప్రశ్నలకు పోలీసులు, విచారణాధికారులు నిగ్గుతేల్చాలనే డిమాండ్లు వస్తున్నాయి. తాజాగా, రాజకీయరంగు పులుముకోవడంతో విచారణ పక్కదారి పట్టకుండా చూడాలని, నిష్పక్షపాతంగా దర్యాప్తు కొనసాగించాలనే సూచనలు వస్తున్నాయి.



నకిరేకల్‌లో పాఠశాల వద్ద పోలీసుల బందోబస్తు



రంజాన్ వేళలు

ఇఫ్తార్: 6:35 (గురువారం సాయంత్రం)

సహర్: 4:51 (శుక్రవారం ఉదయం)

కాన్పుల సంఖ్య పెంచాలి

డీఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్



వెలిమినేడు పీహెచ్‌సీలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో శ్రీనివాస్

చిట్యాలరూరల్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాన్పుల సంఖ్య పెంచాలని జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ అన్నారు. మండలంలోని వెలిమినేడు పీహెచ్‌సీని బుధవారం తనిఖీ చేశారు. రికార్డులు, మందుల పంపిణీ, డ్రగ్స్ స్టోర్‌ను, ఇన్‌పేషెంట్ వార్డును, ల్యాబ్‌ను, ప్రసూతి గదిని పరిశీలించారు. వైద్యం కోసం ఆసుపత్రికి వచ్చిన వారి సేవలు ఎలా ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. గర్భిణుల నమోదును పెంచాలని సూచించారు. అనంతరం ఆసుపత్రి సిబ్బందితో సమావేశమయ్యారు. ప్రభుత్వాసుపత్రుల్లో అందుతున్న సేవల గురించి ప్రజలకు వివరించాలన్నారు. చిన్నారులకు సకాలంలో టీకలను ఇవ్వాలి, వైద్యులు, సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. నాణ్యమైన సేవలందించాలని సూచించారు. సేవలను వైద్యులు, సిబ్బంది వివరించాలన్నారు. సమావేశంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఉబ్బు నర్సింహ, డాక్టర్ లక్ష్మి, సీహెచ్‌వో చక్రవరి, సూపర్‌వైజర్లు శ్యామల, లక్ష్మి, ఫార్మాసిస్ట్, స్టాఫ్‌నర్స్ ప్రసన్నకుమారి, హేమ, త్రివేణి, పద్మావతి, మహేందర్, ఏఎన్ఎంలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాలి

ఓయూ జేఏసీ చైర్మన్ ఎనుగంటి రాజు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రాజు

నల్లగొండ టౌన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): బీసీల రిజర్వేషన్ల బిల్లుకు చట్టబద్ధత కల్పించే బాధ్యత కాంగ్రెస్ పార్టీదేనని ఓయూ జేఏసీ చైర్మన్ ఎనుగంటి రాజు నేత అన్నారు. ప్రభుత్వం వెంటనే జీవో విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక యాదవ సంఘం భవన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్‌లో బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చిందన్నారు. ఈ మేరకు రిజర్వేషన్లకు వెంటనే చట్టబద్ధత కల్పించే బాధ్యత కాంగ్రెస్ పార్టీదేనని అన్నారు. బిల్లును పార్లమెంటుకు పంపి కేంద్ర ప్రభుత్వం మీద నెపం నెట్టివేయాలని రాష్ట్ర ప్రభుత్వం చూస్తోందన్నారు. వెంటనే రిజర్వేషన్లు పెంచే బిల్లుకు జీవో జారీచేసి గవర్నర్‌కు పంపాలన్నారు. 50 ఏళ్లుగా బీసీల కోసం పోరాడుతున్న ఆర్.కృష్ణయ్యను విమర్శించే పద్ధతి మార్చుకోవాలన్నారు. లేదంటే రానున్న రోజుల్లో తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. విలేకరుల సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు దుడుకు లక్ష్మీనారాయణ, జాతీయ ఉపాధ్యక్షుడు మిర్యాల యాదగిరి, నాయకులు మునాస ప్రసన్నకుమార్, గుండు వెంకటేశ్వర్లు, గడ్డె నాగరాజునేత, బెల్లి నాగరాజుయాదవ్, చల్ల కోటేష్‌యాదవ్, సట్టు యాదగిరి, సూర ముత్యాలు, దేవులపల్లి నరసింహ, హరిబాబు, లింగయ్యయాదవ్, జానయ్య, పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది బాధ్యతగా పనిచేయాలి

కలెక్టర్ ఇలా త్రిపాఠి



చింతపల్లి కస్తూర్బాలో విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

చింతపల్లి, మార్చి 26(ఆంధ్రజ్యోతి): వైద్య సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. మంగళవారం పీహెచ్‌సీలో ఓ మహిళకు వైద్య ఆరోగ్య సిబ్బంది సాధారణ ప్రసవం చేశారని తెలియడంతో కలెక్టర్ పీహెచ్‌సీని సందర్శించి సిబ్బందిని అభినందించారు. పీహెచ్‌సీకి వచ్చిన 84 మందితో కలెక్టర్ మాట్లాడి వైద్య సేవలపై అడిగి తెలుసుకున్నారు. మహిళలు ఆరోగ్యంగా ఉండాలంటే పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. అనంతరం మండలంలోని హరిజనాపురం, కుర్మపల్లి, కుర్మేడ్ గ్రామాల్లో కలెక్టర్ పర్యటించారు. వేసవి కావడంతో తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్థులు పలువురు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, తాగునీటి ఎద్దడి నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో, ఏఈని ఆదేశించారు. అంతకుముందు మండల కేంద్రంలోని కేజీబీవీని తనిఖీచేసి విద్యార్థినులతో ఆమె మాట్లాడారు. ఆమె వెంట ఆర్డీవో రమణారెడ్డి, తహసీల్దార్ రమాకాంత్‌శర్మ, ఎంపీడీవో సుజాత, మండల క్లస్టర్ వైద్యాధికారి శ్రీదేవి, ఇక్బాల్, తదితరులు ఉన్నారు.

'పది' కేంద్రాల వద్ద సౌకర్యాలు కల్పించాలి

(ఆంధ్రజ్యోతి, కొండమల్లేపల్లి): పదోతరగతి పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. బుధవారం కొండమల్లేపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో పదోతరగతి పరీక్షా కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద భద్రత, హాజరైన విద్యార్థుల వివరాలు, తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ప్రథమ చికిత్స ఏర్పాట్ల వివరాలను చీఫ్ సూపరింటెండెంట్‌ను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట దేవరకొండ ఏఎస్పీ మౌనిక, ఆర్డీవో రమణారెడ్డి, కొండమల్లేపల్లి ఎస్ఐ రాంమూర్తి, తదితరులు ఉన్నారు.

ఎంపీడీవో కార్యాలయానికి విద్యుత్ నిలిపివేత

- రూ.1.50లక్షలు బిల్లు బకాయి
- సాయంత్రానికి పునరుద్ధరణ



చిట్యాల ఎంపీడీవో కార్యాలయం

చిట్యాలరూరల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ బిల్లు బకాయి ఉండడంతో చిట్యాల ఎంపీడీవో కార్యాలయానికి విద్యుత్ అధికారులు సరఫరా నిలిపివేశారు. సుమారు రెండేళ్లుగా విద్యుత్ బకాయిలు చెల్లించడం లేదు. మూడు రోజుల క్రితం బకాయి బిల్లు అందజేసినట్లుగా తెలిసింది. సుమారు రూ.1.50లక్షలు బకాయి ఉంది. బుధవారం కార్యాలయం తెరచిన కాసేపటికే విద్యుత్ సిబ్బంది కార్యాలయంలో ఫ్యూజ్ తొలగించారు. ఈ విషయాన్ని అధికారులు ఎంపీడీవో జయలక్ష్మి దృష్టికి తీసుకెళ్లారు. విద్యుత్‌ను ఉదయం నుంచి సాయంత్రం నాలుగున్నర వరకు సరఫరాను నిలిపివేశారు. బకాయి పడిన బిల్లును చెల్లిస్తామని అధికారులు విద్యుత్ అధికారులకు సమాచారం ఇచ్చారు. తొలగించిన ఫ్యూజ్‌లను మీటర్ సమీపంలోనే పెట్టి వెళ్లగా తిరిగి నాలుగున్నర సమయంలో వచ్చి అక్కడే పెట్టిన ఫ్యూజ్ కలిపి వెళ్లారు. ఈ విషయంపై ఎంపీడీవో ఎస్‌పీ జయలక్ష్మిని సంప్రదించగా విద్యుత్ బిల్లు బకాయి ఉందని,తగినంతగా ఫండ్ లేనందున చెల్లించడం ఆలస్యమైందని తెలిపారు. విద్యుత్ బిల్లు బకాయిల విషయాన్ని జడ్పీ సీఈవో దృష్టికి తీసుకెళ్లామని ఫండ్ లేనందున చెల్లించలేకపోతున్నామని చెప్పి బిల్లును జడ్పీకి పంపిస్తున్నామని తెలపగా ఆయన సరేనన్నారని, అందుకు బకాయి బిల్లును జడ్పీకి పంపించామని తెలిపారు.

కళాశాలల బకాయిలు వెంటనే చెల్లించాలి

నల్లగొండ క్రైం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని డిగ్రీ కళాశాలలకు నాలుగేళ్లుగా పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిగ్రీ అండ్ పీజీ కళాశాలల యాజమాన్యాల అసోసియేషన్ అధ్యక్షుడు మారం నాగేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్డీవో అశోక్‌రెడ్డికి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. విద్యార్థుల కోసం ప్రభుత్వం చెల్లించే ఫీజుల ద్వారా మాత్రమే నడుస్తున్న డిగ్రీ కళాశాలలకు నాలుగేళ్లుగా ఆర్‌టీఎఫ్, ఎంటీఎఫ్ బకాయిలు చెల్లించడం లేదన్నారు. దీంతో పేద విద్యార్థులతోపాటు కళాశాలల యాజమాన్యాలు ఇబ్బందులకు గురవుతున్నాయన్నారు. ప్రభుత్వం ఎంటీఎఫ్ చెల్లించకపోవడంతో పేద విద్యార్థులు పరీక్ష ఫీజులను సైతం చెల్లించలేక మధ్యలోనే విద్యకు దూరమవుతున్నారని అన్నారు. ఆర్థిక భారం, అప్పుల బాధతో కళాశాలలు నిర్వహించలేని పరిస్థితి ఉందని, వెంటనే బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు పి.నర్సింహారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సత్యం, గుండగోని జానయ్యయాదవ్, జైపాల్‌రెడ్డి, సైదారావు, నగేష్, చుక్కా సైదులు, తదితరులు పాల్గొన్నారు.



ఆర్డీవో అశోక్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న మారం నాగేందర్‌రెడ్డి, తదితరులు

సీఎస్, డీవోలపై చర్యలకు సిఫార్సు

- ఇంటర్ ప్రశ్నపత్రాల ప్యాకింగ్ విషయంలో నిర్లక్ష్యం
- ఇంక్రిమెంట్ నిలిపివేయడం లేదా జరిమానా విధించాలని సూచన
- కలెక్టర్‌కు నివేదిక ఇచ్చిన మిర్యాలగూడ సబ్‌కలెక్టర్
- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

నల్లగొండ, మార్చి 26 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): ఇంటర్ ప్రశ్నపత్రాలను పరీక్షా కేంద్రానికి తీసుకురావడంలో నిర్లక్ష్యం వహించిన సీఎస్, డీవోలపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠికి మిర్యాలగూడ సబ్‌కలెక్టర్ అమిత్ నారాయణ్ నివేదించారు. 'ఇంటర్ ప్రశ్నపత్రాల ప్యాకింగ్‌లో నిర్లక్ష్యం' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ఈనెల 15న ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించి విచారణనిర్వహించారు. 12వ తేదీ ప్రశ్నపత్రాల బండిల్స్‌తో పాటు, 13వ తేదీకి సంబంధించిన ఒకేషనల్ ప్రశ్నపత్రాల బండిల్స్ వచ్చిన విషయాన్ని విచారణలో నిర్ధారించి, దీనికి బాధ్యులైన హాలియా జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ జాకిర్ హుస్సేన్, డిపార్ట్‌మెంటల్ అధికారి వెంకటేశ్వర్లుకు ఒక ఇంక్రిమెంట్ నిలిపివేయడం లేదా, జరిమానా విధించడం గానీ చేయాలని కలెక్టర్‌కు మిర్యాలగూడ సబ్‌కలెక్టర్ అమిత్ నారాయణ్ నివేదిక ఇచ్చారు. ప్రశ్నపత్రం విషయంలో 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనంపై కలెక్టర్ స్పందించి విచారణ నిర్వహించాలని మిర్యాలగూడ సబ్‌కలెక్టర్ అమిత్‌నారాయణ్‌ను ఆదేశించారు. ఆయన ఆదేశాల మేరకు అనుముల తహసీల్దార్ విచారణ నిర్వహించారు. హాలియా ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రంలో 12వ తేదీన వచ్చిన ప్రశ్నపత్రాల బండిల్స్‌తో పాటు, 13వ తేదీకి సంబంధించిన ఒకేషనల్ ప్రశ్నపత్రాల బండిల్స్ కలిసి వచ్చాయి. అయితే ఈ బండిల్స్ కలిసిన విషయాన్ని వెంటనే గుర్తించి, వాటిని తెరవకుండా తిరిగి పోలీస్‌కస్టడీకి తరలించారు. దీంతో ప్రశ్నపత్రం లీక్ వంటి ప్రమాదం జరగలేదు. అయితే ఈ ఘటనకు చీఫ్ సూపరింటెండెంట్ జాకిర్ హుస్సేన్, డిపార్ట్‌మెంటల్ అధికారి వెంకటేశ్వర్లు బాధ్యులుగా గుర్తించామని, వారి తప్పిదంగానే పరిగణించి చర్యలు తీసుకోవాలని సూచిస్తూ కలెక్టర్‌కు సబ్‌కలెక్టర్ నివేదిక సమర్పించారు.

గోదాముల నిర్మాణానికి సబ్సిడీలు ఇవ్వాలి

డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి



చెన్నైలో ఎఫ్‌సీఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌తో శ్రీనివాస్‌రెడ్డి

నల్లగొండ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోళ్ల అనంతరం నిల్వల కోసం గోదాముల నిర్మాణానికి సబ్సిడీ ఇవ్వాలని ఉమ్మడి నల్లగొండ జిల్లా డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి కోరారు. బుధవారం తమిళనాడు రాష్ట్రంలోని చెన్నైలో సౌత్ ఇండియా ఎఫ్‌సీఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జజింత లాజరస్‌తో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పీఏసీఎస్‌ల ద్వారా ధాన్యం సేకరించి గోదాముల్లో నిల్వ ఉంచితే గిట్టుబాటు ధర లభించినప్పుడు రైతులు విక్రయించి లాభాలు ఆర్జించడానికి వీలుగా ఉంటుందన్నారు. అదేవిధంగా రైతులు దళారుల బారిన పడకుండా ఉంటుందన్నారు. అందుకు సహకరించాలని కోరారు.

నేటికీ జనరంజకం చేస్తూ..

నల్లగొండ జిల్లాలోని పలుసంస్థలు నాటకరంగాన్ని సజీవంగా నిలుపుతున్నాయి. సమాజంలోని రుగ్మతులను, చెడులను ఎత్తి చూపిస్తూ మార్పునకు కృషి చేస్తున్నాయి. గతంతో పోల్చితే ప్రస్తుతం నాటక రంగం ఆదరణ కోల్పోతోంది. కళారంగం మీదనే ఆధారపడిన కొందరు కళాకారులకు జీవనోపాధి కరువైంది. నాటక రంగం సజీవంగానే ఉన్నా సినిమాలు, టీవీల ప్రభావంతో ఆదరణ తగ్గింది. నాటకరంగాన్ని కాపాడుకునేందుకు కొన్ని కళాసంస్థలు అడపాదడపా నాటకాలను ప్రదర్శిస్తూనే ఉన్నాయి. నేడు ప్రపంచ రంగస్థలం(నాటక) దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం..

(ఆంధ్రజ్యోతి-నల్లగొండ)

గతంలో నల్లగొండలో జనరంజన కళావాహిని, కోమలి కళా సమితి, డాక్టర్ రాజారావ్ ఆర్ట్స్ మెమోరియల్ అకాడమీ, ఎన్టీఆర్ డెమొక్రటిక్ అసోసియేషన్, రసరంజని కళాసంస్థలు ప్రధానంగా పనిచేశాయి. అనేక నాటకాలను ప్రదర్శించి అవార్డులను కూడా అందుకున్నాయి. కోమలి కళా సమతి ఐదేళ్ల నుంచి నంది అవార్డులను సైతం అందుకుంది. ఇప్పటికీ ఈ సంస్థ నాటక ప్రదర్శనలు ఇస్తూ మేమున్నామనే భావనను ప్రజల్లో కల్పిస్తోంది. ప్రస్తుతం చారిత్రాత్మకమైన నాటకాలు, పౌరాణిక నాటకాలకు ప్రాధాన్యమిస్తూ నాటకాలను ప్రదర్శిస్తున్నారు.



'అన్నట్లు మనం మనుష్యులం కాదు' నాటికలో ఒక సన్నివేశం

కోమలి కళా సమితి పుట్టుక

ఔత్సాహిక కళాకారులతో కలుపుకుని దుగ్గి వెంకటేశ్వర్లు, కోడి రాములు నాయకత్వంలో 1978లో కోమలి కళా సమితి సంస్థను స్థాపించారు. కోడి రాములు తృతీయ పుత్రిక పేరున కోమలి కళాసమితి ఏర్పాటైంది. నాటి నుంచి నేటి వరకు వ్యవస్థాపక అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఈ సమితి ఆధ్వర్యంలో పూల రంగడు, రక్తపిపాసి, మనసున్న మనిషి, మంచు బొమ్మలు, సమాధి కడుతున్నాం, చందాలు ఇవ్వండి, రఘుపతి రాఘవ రాజారాం, క్షీరసాగర మథనం, బైబిల్ దొంగలు మరియు కీర్తిశేషులు, కృషితో నాస్తి దుర్భిక్షం వంటి నాటకాలను ప్రదర్శించారు.

నంది అవార్డులు..

నేటి వరకు అనేక అవార్డులను కోమలి కళా సమితి సంస్థ కళాకారులు అవార్డులను అందుకున్నారు. 2009లో 'అసలు నేను' నాటికం రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి నంది అవార్డును అందుకుంది. ఇవే కాకుండా అనేక అవార్డులను కళాకారులు కైవసం చేసుకున్నారు. 2010లో 'ఆత్మ గీతం' సాంఘిక నాటిక ప్రదర్శనకు అప్పటి ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి నంది అవార్డును అందజేశారు.

జనరంజని కళావాహిని

జనరంజని, కళావాహిని, సాహిత్య సాంస్కృతిక నాటక సంస్థ అధ్యక్షుడిగా గజవెల్లి సత్యం 1966 నుంచి వ్యవహరిస్తున్నారు. ఈ సంస్థ ఆధ్వర్యంలో మార్పు జరిగిన కథ, పరివర్తన, మదు పర్కం, నారీమేతం వంటి నాటకాలను ప్రదర్శించారు. ప్రస్తుతం జనరంజని కళావాహినిని అడపాదడపా నాటకాలను ప్రదర్శిస్తోంది. జిల్లా కేంద్రంలో కోమలి కళా సమితి, జనరంజని కళావాహిని నాటక సంస్థలు మాత్రమే చురుకుగా పనిచేస్తున్నాయి. మిగిలిన సంస్థలు పనిచేయడం లేదు.



నాటక రంగాన్ని ప్రోత్సహించాలి



ఒకప్పుడు నాటక రంగానికి ఎంతో ఆదరణ ఉండేది. నల్లగొండ జిల్లాలో అనేకమైన సాంఘిక, పౌరాణిక, చారిత్రాత్మకమైన నాటకాలను ప్రదర్శించాం. ప్రజల నుంచి కూడా మంచి స్పందన వచ్చేది. ప్రస్తుతం టీవీ సీరియల్స్ సినిమాహాళ్ల ప్రభావంతో ఆదరణ తగ్గింది. నేను నటుడిగా టీవీ సీరియల్స్‌లో, సినిమాల్లో అనేక పాత్రలు పోషించా. జైబోలో తెలంగాణ సినిమాల్లో, అదీ లెక్క సినిమాల్లో నటించా. అదేవిధంగా 8 టీవీసీరియల్స్‌లోనూ నటించా. ఇప్పటికీ వేదికపైన తనకు ఇచ్చిన పాత్రను పోషిస్తూ ప్రజల ఆదరణ పొందుతున్నా.

గజవెల్లి సత్యం, జనరంజని కళావాహిని సంస్థ అధ్యక్షుడు

సంస్థలను ఆదుకోవాలి



ప్రస్తుతం నాటక రంగానికి ఆదరణ తగ్గింది. కానీ ప్రజల హృదయాల్లో నిలిచిఉంది. కోమలి కళా సమితి అనేక ప్రదర్శనలు నిర్వహించి అవార్డులను అందుకుంది. 2009 నుంచి 2011 వరకు నంది అవార్డులను గెలుచుకుంది. నాటకరంగంలోని నటీనటులు కొందరు టీవీ సీరియల్స్ సినిమాల్లో నటిస్తున్నారు. నాటక రంగం మీద ఉన్న అభిమానంతో ఇప్పటికీ ఏదో ఒక నాటికను ప్రదర్శిస్తున్నాం. ప్రభుత్వం నాటక రంగాన్ని ప్రోత్సహించాలి.

బక్క పిచ్చయ్య, కోమలి కళా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు

కొట్టు బాబు..
అలియాస్ కృష్ణుడు



(ఆంధ్రజ్యోతి-హుజూర్‌నగర్)

సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణానికి చెందిన కొట్టు లక్ష్మీనారాయణ బాబు(కొట్టు బాబు) నాటకరంగం కళాకారుడిగా సుపరిచితుడు. శ్రీకృష్ణుడు, దుర్యోధనుడు, శివుడుతో పాటు సత్యహరిశ్చంద్రుడు లాంటి పాత్రల్లో ఆయన నట ఎంతగానో ఆకట్టుకుంటుంది. ఆరు పదుల వయసులోనూ తన నటనా చాతుర్యాన్ని ప్రదర్శిస్తున్నారు. తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాల్లో ప్రదర్శనలు ఇచ్చారు. మూడు దశాబ్దాలుగా రంగస్థలంలో ఆయన పోషించిన పాత్రలతో ఎన్నో అవార్డులు, పురస్కారాలు అందుకున్నారు విద్యార్థి దశ నుంచే కొట్టు బాబు కళలవైపు మళ్లారు. ఏడాదికి కనీసం 10 రంగ స్థల వేదికలపై ఆయన కళాప్రదర్శనలు నిర్వహిస్తుంటారు. పదేళ్ళుగా స్పందన నాట్యకళామండలి వ్యవస్థాపక చైర్మన్‌గా ఉంటూ ప్రతి ఏటా ఉగాదికి కవి సమ్మేళనాలు నిర్వహిస్తున్నారు. భారీ నగదు పురస్కారాలు అందిస్తూ యువ కళాకారులను ప్రోత్సహిస్తున్నారు.

హుజూర్‌నగర్‌లో పలువురు

హుజూర్‌నగర్ పట్టణంలోని అనేకమంది కళాకారులు రంగస్థల వేదికలపై దశాబ్దాలుగా ప్రదర్శనలు ఇస్తున్నారు. ప్రజానాట్యమండలి సీనియర్ కళాకారులు దొంతగాని సత్యనారాయణ, గోపనబోయిన వెంకటేశ్వర్లు, కంబాల పెద్దశ్రీనివాసులు అనేక ప్రదర్శనలు నిర్వహించారు. పౌరాణిక, జానపద, చారిత్రాత్మక, దేశభక్తి గీతాలు, చిన్న చిన్న నాటికలు ప్రదర్శించారు. బోనాల జాతర, యమధర్మరాజు, యమలోకంలో భూలోకపాపులు వంటి నృత్యనాటికలు ప్రదర్శించారు. మోహిని భస్మాసుర, మహిషాసురమర్ధిని నాటికలు నిర్వహించారు. టైగర్ శివ, సూర్యోదయం వంటి సాంఘిక నాటకలు వేశారు. 40 ఏళ్లుగా సత్యనారాయణ రంగ స్థలంపై ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు.

5 దశాబ్దాలు.. 500 ప్రదర్శనలు

● రంగస్థల నటుడిగా
రాణిస్తున్న సోమ అంజిరెడ్డి



నంది అవార్డు తెచ్చిన కుమారగిరిరెడ్డి పాత్రలో అంజిరెడ్డి

(ఆంధ్రజ్యోతి-నార్కట్‌పల్లి)

నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని చౌటబావికి చెందిన సోమ అంజిరెడ్డి ఆర్టీసీలో డ్రైవింగ్ ఇన్‌స్ట్రక్టర్‌గా ఉద్యోగం చేస్తూనే ప్రవృత్తిగా రంగస్థల కళాకారుడిగా ప్రదర్శనలిస్తూ ఎన్నో ప్రశంసలు, అవార్డులు అందుకున్నారు సుమారు 57 ఏళ్లుగా రంగస్థల కళాకారుడిగా రాణిస్తూ 500 వరకు ప్రదర్శనలు ఇచ్చారు. నార్కట్‌పల్లి ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుకునే రోజుల్లో పాఠశాలలో సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించేవారు. గాత్రం బాగా ఉండటంతో నాటకాల్లో పనికొస్తావని తోటి విద్యార్థులిచ్చిన ప్రోత్సాహంతో తొలిసారిగా 'చైతన్యం' అనే సాంఘిక నాటకంలో విలన్‌పాత్రను పోషించాడు. తదనంతరం వివాహం, ఆర్టీసీలో హకీంపేటలో(డ్రైవింగ్ ఇన్‌స్ట్రక్టర్‌గా) ఉద్యోగం చేస్తూ రంగస్థల ప్రదర్శనలపై ఆసక్తిని తగ్గించుకోలేదు. నేటికీ ప్రదర్శనలు ఇస్తూ నాటకప్రియుల మనసును గెలుచుకుంటున్నారు. 'మాతృదేవోభవ' నాటకంలో కృష్ణుడి పాత్రకు టీటీడీ 'గరుడ' అవార్డుతో సత్కరించింది. వసంత రాజీయం నాటకంలో వేసిన కుమారగిరిరెడ్డి పాత్రకు గాను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2023లో బళ్లారి రాఘవ నంది అవార్డును అందజేసింది. ఆర్టీసీ సంస్థ అంజిరెడ్డి కళాప్రతిభను గుర్తించి సత్కరించింది.

శ్రీకృష్ణుడిగా అంజిరెడ్డి


అంజిరెడ్డికి నచ్చిన పాత్ర శ్రీకృష్ణుడు. పౌరాణికాల్లో వందల నాటకాలు వేయగా అందులో సుమారు 100పర్యాయాలు కృష్ణుడి వేషమే వేశారు. సత్యహరిశ్చంద్రలో హరిశ్చంద్రుడిగా,రామాంజనేయ యుద్ధంలో రాముడిగా, గయోపాఖ్యానంలో అర్జునుడిగా, నలదమయంతిలో బావుకుడిగా పాత్రలు పోషించినా కృష్ణుడి పాత్రంటేనే ఇష్టం. ఇదే పాత్రకు ఎన్నో నాటక పరిషత్తులు ఉత్తమనటుడిగా అంజిరెడ్డిని సన్మానించాయి.

టీఎన్ఎస్ఎస్ ఉపాధ్యక్షుడిగా..

నార్కట్‌పల్లి ఆర్టీసీ డిపోలో పనిచేస్తూ సహచర ఉద్యోగులతో కలిసి మూడు దశబ్దాల క్రితం నటరాజ కళానికేతన్‌ను ఏర్పాటుచేశారు. 700కు పైగా ఉన్న తెలంగాణా నాటక సమాజాల సమాఖ్యకు అయన రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. మురళీకృష్ణ సాంస్కృతిక కళాసంస్థను స్థాపించి రంగస్థల ప్రదర్శనలు ఇస్తున్నారు.

కళల క్షేత్రం కావాలని..

● యాదగిరిగుట్టలో శాస్త్రీయ అకాడమీ ఏర్పాటుకు డిమాండ్



ప్రపంచ ఆధ్యాత్మిక, పర్యాటక క్షేత్రంగా వర్ధిల్లుతోన్న శ్రీలక్ష్మీ నృసింహస్వామి క్షేత్రంలో శాస్త్రీయ అకాడమీ ఏర్పాటుచేయాలన్న డిమాండ్ పెరుగుతోంది. అధ్యయనోత్సవాలు, బ్రహ్మోత్సవాలకు తోడు వారాంతాల్లో, ప్రత్యేక పర్వదినాల్లో కొండపై సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందుకోసం ఆయారంగాల్లో ప్రావీణ్యం సాధించిన కళాకారులను ఆహ్వానిస్తున్నారు. ఈ నేపథ్యంలో క్షేత్రంలోనే శాస్త్రీయ అకాడమీని ఏర్పాటు చేయాలని ఔత్సాహికులు కోరుతున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా వాసులకు శాస్త్రీయ కళలు నేర్చుకునే అవకాశం దక్కాలంటే క్షేత్రంలో నామమాత్రం రుసుంతో అకాడమీ ఏర్పాటుకు స్వామిని కళాకారులు వేడుకుంటున్నారు.

(ఆంధ్రజ్యోతి-యాదగిరిగుట్ట)

విశ్వఖ్యాతిగాంచిన భరతనాట్యం, కూచిపూడి, కథాకళి, పేరిణి, ధార్మిక, సాహిత్య, సంగీతం వంటి కళలు ప్రతీ ఒక్కరిని ఆకట్టుకుంటాయి. వీటికి జీవం పోసేందుకు 1969లోనే యాదగిరిగుట్టలో 'నవోదయ కళానిలయం' స్థాపించారు. ఈ సంస్థ ద్వారా ఎంతోమంది కవులు, కళాకారులు క్షేత్ర మహత్యంపై అనేక పాటలు, పద్యాలు, క్షేత్ర చరిత్ర, నృరసింహ చరిత్రపై పలు నాటకాలు వేశారు. ఏటా జరిగే వార్షిక బ్రహ్మోత్సవాల్లో స్థానిక కళాకారులు అప్పట్లో అనేక ప్రదర్శనలు ఇచ్చేవారు. అనంతరం ప్రోత్సాహం లేక పోవడంతో కాలక్రమేణా ఆ సంస్థ కనుమరుగైంది.

అకాడమీతో ప్రోత్సాహం

ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు, జయంతి ఉత్సవాలు, ప్రత్యేక, పండగ, పర్వ దినాలే కాక ప్రతీ శుక్ర, శని, ఆది వారాల్లో కొండపైన ధార్మిక, సాహిత్య, సంగీత సభలు చేపట్టడం ఆనవాయితీగా వస్తోంది. కాగా, ఎక్కడెక్కడో కళలు నేర్చుకొని ఇక్కడ ప్రదర్శనలిచ్చే కళాకారుల విన్నపాల మేరకు దేవస్థానం అనుమతిస్తోంది. ఇదిలా ఉంటే దాతల సహకారంతోనైనా దైవసన్నిధిలో శాస్త్రీయ అకాడమీ నెలకొల్పితే కొత్త తరం కళలను నేర్చుకునేందుకు అవకాశం ఉంటుందని, అదేసమయంలో స్థానిక ఔత్సాహికులను ప్రోత్సహించేందుకు వీలుంటుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇందుకోసం అకాడమీ స్థాపనకు స్థల కేటాయింపు చేయాలని స్థానిక కళాకారులు కోరుతున్నారు. స్థానికులకే కాక రాష్ట్రం నలుమూలల నుంచి ఔత్సాహికులకు నామమాత్రం రుసుంతో నేర్చుకునే అవకాశం కలుగుతుందని అభిప్రాయపడుతున్నారు. నిత్యం ఆధ్మాత్మికశోభతో పర్యాటక ప్రదేశంగా దినదినాభివృద్ధి చెందుతోన్న యాదగిరిగుట్ట కళాపోషణకు కేంద్రంగా, కళలకు వేదికగా మారి కళాకారులకు జీవనోపాధి కల్పించే స్థాయికి ఎదగాలని ఆకాంక్షిస్తున్నారు.

కళలను ప్రోత్సహించాలి



విశ్వక్షేత్రంగా విరాజిల్లుతోన్న యాదగిరిగుట్ట క్షేత్రంలో కళలను ప్రోత్సహించాలి. వివిధప్రాంతాల్లోని కళాకారులకు తగినంత ప్రాధాన్యమిచ్చి క్షేత్రంలో జరిగే కళాప్రదర్శనలో అవకాశం కల్పించాలి. తగిన ప్రోత్సాహం లేక ఆసక్తి గల కళాకారులు నిరాశ చెందుతున్నారు. కొండపైన జరిగే ప్రదర్శనలో స్థానికులకు అవకాశం ఇచ్చేందుకు అధికారులు ప్రత్యేక చొరవచూపాలి. అదేవిధంగా అకాడమీ నెలకొల్పేందుకు స్థలం కేటాయించాలి.

మేడి శివకుమార్,కవి, యాదగిరిగుట్ట

స్థానికులకు రెండు రోజులు అవకాశం కల్పించాలి



యాదగిరిగుట్ట దేవస్థానం ఆధ్వర్యంలో ప్రతి ఏటా నిర్వహించే వార్షిక బ్రహ్మోత్సవాలు, జయంతోత్సవాల్లో కళా కారులు ఇస్తున్న ప్రదర్శనల్లో స్థానికులకు ప్రత్యేకంగా రెండు రోజులు కేటాయించాలి. కళలపై ఆసక్తి ఉన్న ఔత్సాహితులకు తగిన ప్రోత్సాహం అందజేయాలి. జిల్లాలో ఉన్న కళాకారులు శాస్త్రీయ విద్యను అభ్యసించేందుకు అకాడమీ ద్వారా తోడ్పాటు అందించాలి.

శ్రీపాద శివప్రసాద్, రచయిత, యాదగిరిగుట్ట

పైన కొబ్బరి బొండాలు..
కింద దూడలు

● వాహనం బోల్తాతో బయటపడిన విషయం

నకిరేకల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): డీసీఎం వాహనం ట్రాలీ పైభాగంలో కొబ్బరిబొండాలు ఉంచి కిందిభాగంలో టార్పాలిన్ కప్పి దూడ లను అక్రమంగా తరలిస్తున్నారు.ఆ వాహనం ప్రమాదవశాత్తు బోల్తా పడడంతో విషయం బయటపడింది. నల్లగొండ జిల్లా నకిరేకల్ మండలం కడపర్తి సమీపంలో బుధవారం జరిగింది. ఎస్ఐ సురేష్ తెలిపిన వివరాల ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తుని నుంచి 13 లేగదూడలను డీసీఎం వాహనంలో హైద రాబాద్‌కు అక్రమంగా తరలిస్తుండగా నకిరే కల్ మండలం కడపర్తి సమీపంలో ప్రమా దవశాత్తు బోల్తాపడింది. వాహనంలో కింద దూడలను ఉంచి, పైభాగంలో కొబ్బరి బొం డాలు ఉంచారు. వాటిని హైదరాబాద్‌కు తర లిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. 365వ జాతీయరహదారి మీదుగా హైదరాబాద్‌కు 13దూడలను తరలిస్తుండగా వాహనం బోల్తా పడి ఒక దూడ మృతిచెందిందని ఎస్ఐ సురేష్ తెలిపారు. మిగిలిన దూడెలను నల్ల గొండలోని గోశాలకు తరలించారు. వాహన డ్రైవర్‌తో పాటు మరో ఇద్దరిపై కేసు పెట్టి, వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు.

బంగారం తాకట్టు
వ్యాపారి పట్టివేత

కిలో 185 గ్రాముల బంగారం స్వాధీనం...

యాదగిరిగుట్ట రూరల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణంలో రెండునెలల క్రితం స్థానిక ప్రజలను మోసం చేసి బంగారంతో ఉడాయించిన జితేందర్‌లాల్, మధురాములను పోలీసులు పట్టుకున్నారు. సీఐ రమేష్ బుధవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జితేందర్‌లాల్, మధురాములు చిట్యాల మీదుగా బైక్‌పై పారిపోతున్నట్లు పక్కా సమాచారం మేరకు సిబ్బంది హుటాహుటిన వెళ్లి పట్టుకున్నట్లు తెలిపారు. వారిని విచారించి, వారి వద్ద ఉన్న కిలో 185 గ్రాముల బంగారం రికవరీ చేసినట్లు తెలిపారు. మరో కిలో 946 గ్రాములబంగారం సౌత్ఇండియా బ్యాంకులో ఉన్నట్లు గుర్తించామన్నారు. ఆ బంగారాన్ని సీజ్ చేయడానికి ఆదేశాలు జారీ చేశామన్నారు. అదేవిధంగా 64 కిలోల 620 గ్రాముల వెండి ఆభరణాలను సీజ్ చేసి, కోర్టులో డిపాజిట్ చేశామన్నారు.అ దేవిధంగా వారిని రిమాండ్ చేసినట్లు తెలిపారు.

తాగుడుకు బానిసై దారిదోపిడీ

నల్లగొండ క్రైం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : అర్ధరాత్రి జులాయిగా తిరుగుతూ ఒంటరి వ్యక్తులపై దాడి చేసి దోపిడీకి పాల్పడుతున్న నలుగురు వ్యక్తులను నల్లగొండ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుల వివరాలను బుధవారం నల్లగొండ జిల్లాకేంద్రంలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో సీఐ రాఘవరావు, ఎస్ఐ ఎర్ర సైదులు వెల్లడి ంచారు. తిరుమలగిరి(సాగర్) మండలం చిలుకాపురం గ్రామానికి చెందిన తుడుము ధనుంజయ్(ప్రస్తుతం నల్లగొండలోని రామగిరిలో నివాసం), నల్లగొండ గాంధీనగర్‌కు చెందిన మునగ వంశీ, కట్టంగూరు మండలం మల్లారం గ్రామానికి చెందిన పెద్ది శివప్రసాద్, నల్లగొండ పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన గజ్జి సాయి శ్రీకాంత్ స్నేహితులు. వీరందరూ మద్యానికి బానిసలు కావడంతో పాటు గంజాయికి అలవాటుపడ్డారు. వీరికి ఏపనీచేయడం చేతకాక వారి తాగుడుకు, గంజాయికి డబ్బులు లేక పోవడంతో ఒంటరిగా ఎవరైనా కనిపిస్తే వారిని కొట్టి డబ్బులు లాక్కోవాలని పథకం వేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ నెల 20న అర్ధరాత్రి రెండు బైకులపై నలుగురు కలిసి సావర్కర్‌నగర్‌లోని రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి సమీపంలో తిరుగుతుండగా 1.30 గంటలకు పట్టణానికి చెందిన వడ్లాల సాయికిరణ్ నడుచుకుంటూ రేల్వేస్టేషన్ వైపు వెళ్తున్నాడు. నలుగురు నేరస్తులు సాయికిరణ్‌ను అడ్డగించి చేతులతో కొట్టి అతడి వద్ద ఉన్న రూ.1400 నగదు, అతడి సెల్‌ఫోన్‌ను తీసుకుని, చంపుతామని బెదిరించారు. సాయికిరణ్ సెల్‌ఫోన్‌లోని ఫోన్‌పే పాస్‌వర్డ్ తెలుసుకుని అక్కడి నుంచి నేరస్తులు నలుగురు వెళ్లిపోయారు. సాయికిరణ్ వద్ద తీసుకున్న నగదులో రూ.800లను మద్యం తాగేందుకు ఖర్చు చేసినట్లు పోలీసులు తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు బుధవారం ఉదయం ఆరు గంటల సమయంలో నిందితులైన తుడుము ధనుంజయ్, మునగ వంశీ, పెద్ది శివ ప్రసాద్, గజ్జి సాయి శ్రీకాంత్‌లను రామగిరిలోని తుడుము ధనుంజయ్ ఇంటి వద్ద అరెస్టు చేశామన్నారు. వీరి వద్ద నుంచి నేరం చేసేందుకు వినియోగించిన టీఎస్ 05 ఎఫ్ఈ0161 బజాజ్ ప్లాటినం బైకు, టీఎస్ 11ఈడబ్ల్యూ 4884 యమహా ఆర్ 15 బైక్‌ను, రెండు సెల్‌ఫోన్లు, రూ.600 నగదును స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించామని సీఐ, ఎస్ఐ తెలిపారు. నిందితులైన తుడుము ధనుంజయ్, గజ్జి సాయిశ్రీకాంత్‌లు 2024లో ఎల్‌బీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గంజాయి కేసులో అరెస్టై జైలుకు వెళ్లి వచ్చారని సీఐ, ఎస్ఐ తెలిపారు. నిందితులను నల్లగొండ డీఎస్పీ కొలను శివరాంరెడ్డి పర్యవేక్షణలో పట్టుకున్న నల్లగొండ టూటౌన్ సీఐ రాఘవరావు, ఎస్ఐ ఎర్ర సైదులు, సిబ్బంది లావూరి బాలకోటి, శంకర్‌ను నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అభినందించారు.



నిందితులను చూపుతున్న సీఐ రాఘవరావు, ఎస్ఐ సైదులు

కంటైనర్‌ను వెనుక నుంచి ఢీకొట్టిన బస్సు

13మంది ప్రయాణికులకు గాయాలు

చౌటుప్పల్ రూరల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం ధర్మోజిగూడెం వద్ద జాతీయ రహదారిపై బుధవారం తెల్లవారుజామున 6.15 నిమిషాలకు రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ప్రైవేటు ట్రావెల్స్ బస్సులో ప్రయాణిస్తున్న 13మంది ప్రయాణికులు గాయపడ్డారు. చౌటుప్పల్ సీఐ మన్మధకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడ నుంచి హైదరాబాద్ వెళ్తున్న భారీ కంటైనర్ డ్రైవర్ ఒక్కసారిగా వాహనాన్ని నెమ్మది చేశాడు. దీంతో వెనుక నుంచి వచ్చిన ఆరెంజ్ ట్రావెల్స్ బస్సు ఢీకొట్టింది. అదే సమయంలో ఇదే వరుసలో బస్సు వెనుక ఉన్న సాయికృష్ణ ట్రావెల్స్ బస్సు ప్రమాదానికి గురైన ట్రావెల్స్ బస్సును ఢీకొట్టింది. ఈ సంఘటనలో ఆరెంజ్ ట్రావెల్స్ బస్సులో మొత్తం 50 మంది ఉండగా, 13 మంది ప్రయాణికులు గాయపడ్డారు. కంటైనర్ డ్రైవర్ అజాగ్రత్తగా ఎలాంటి సిగ్నల్స్ లేకుండా రోడ్డుపై నడుపుతూ అకస్మాత్తుగా నెమ్మది చేయడంతో వెనుక నుంచి వచ్చిన ట్రావెల్స్ బస్సులు ఢీకొట్టాయి. ఈ ప్రమాదంలో విజయవాడ పరిసర ప్రాంతాలకు చెందిన ముప్పరాజు మణికంఠ, సుజిత్‌కుమార్, శ్రీపాద విజయ్, పోలుకొండ అనూష, మణి విశ్వనాథ్, బిపన్ నాయుడు, బీడన్ సూతార్, రాయపురెడ్డి వీరవాణి, ఓలేటి మౌనిక, జగన్నాథ్, కాట్రగడ్డ సాయి చైతన్య, గడ్డం కిశోర్, శ్రీమన్నారాయణలు ప్రమాదానికి గురయ్యారు. క్షతగాత్రులను చౌటుప్పల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బస్సు డ్రైవర్ శివరామకృష్ణ క్యాబిన్‌లో ఇరుక్కుపోవడంతో పోలీసులు శ్రమించి బయటకు తీసి ప్రాణాలను రక్షించారు. అయితే ఈ ఘటనలో శివరామకృష్ణ రెండు కాళ్లు విరిగాయి. రోడ్డు ప్రమాదంతో జాతీయ రహదారిపై సుమారు అరగంట మేర ట్రాఫిక్ జామ్‌కాగా, కిలోమీటర్ మేర వాహనాలు నిలిచిపోయాయి. అనంతరం పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఈ ప్రమాద ఘటనపై కంటైనర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మన్మధకుమార్ తెలిపారు. సాయికృష్ణ ట్రావెల్స్ బస్సులోని ప్రయాణికులకు ఎటువంటి గాయాలు కాలేదు.



లారీని వెనుక నుంచి ఢీకొట్టిన బస్సు, గాయపడిన వారిని ఆస్పత్రికి తరలిస్తున్న పోలీసులు, స్థానికులు

మేకలు కాసేందుకు వెళ్లి ఆత్మహత్య



హరిబాబు(ఫైల్)

రాజాపేట, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా రాజాపేట మండలం మోల్లగూడెం గ్రామానికి చెందిన రెడ్డబోయిన హరిబాబు అలియాస్ అభి(19) బుధవారం వ్యవసాయ బావి వద్ద ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏఎస్ఐ మైసయ్య, గ్రామస్థులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని మోల్లగూడెం గ్రామానికి రెడ్డబోయిన మల్లేష్-లావణ్యకు ఇద్దరు సంతానం. పెద్ద కుమారుడైన హరిబాబు మూడు రోజుల క్రితం ఇంటి నుంచి మేకలు కాసేందుకు వెళ్లి అదృశ్యమయ్యాడు. స్నేహితులు, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో మంగళవారం తండ్రి మల్లేష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కాగా బుధవారం ఉదయం మోల్లగూడెం, కొండేటి చెరువు శివారులో వ్యవసాయ బావి వద్ద చెట్టుకు ఉరివేసుకొని హరిబాబు ఆత్మహ్యతకు పాల్పడ్డాడు. సమీప బావుల రైతులు చూసి సమాచారం అందజేశారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు. ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు. తండ్రి మల్లేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ మైసయ్య తెలిపారు.

తండ్రితో గొడవతో కుమారుడు....

మోత్కూరు, మార్చి 26(ఆంధ్రజ్యోతి): తండ్రితో గొడవపడ్డ కుమారుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండలం దత్తప్పగూడెం గ్రామంలో జరిగింది. దత్తప్పగూడెం గ్రామానికి చెందిన శీలం సెల్వరాజ్, చిన్నకుమారుడు ప్రజ్వల్(20)తో కలిసి గ్రామంలో సెంట్రింగ్ పనిచేస్తుంటారు. ఈ నెల 25న ఉదయం గ్రామంలో వెంకన్న అనే వ్యక్తి ఇంటికి సెంట్రింగ్ పనిచేయడానికి వెళ్లారు. అక్కడ పనిచేయడానికి సిద్ధమవుతుండగా రెండురోజులుగా పని చేస్తున్నాం కదా ఈ రోజు పనిబంద్ పెడదామని చిన్నకుమారుడు ప్రజ్వల్ తండ్రితో గొడవపడ్డారు. దాంతో ఆరోజు పనిచేయకుండా ఇంటికి వెళ్లారు. ఇంటికి వచ్చిన కొద్దిసేపటికి ప్రజ్వల్ వాంతులు చేసుకుంటూ ఇంట్లో నుంచి బయటకు వచ్చాడు. గమనించిన తండ్రి సెల్వరాజ్ ఏమైందని అడగ్గా సెల్‌ఫోన్ క్లీనింగ్ చేసే రసాయనం తాగానని చెప్పాడు. వెంటనే అతడిని మోత్కూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి ప్రాథమిక చికిత్స చేయించి భువనగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని చెప్పడంతో అక్కడి నుంచి హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. తండ్రి సెల్వరాజ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ నాగరాజు తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని యువకుడు మృతి

చిట్యాల రూరల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా చిట్యాల మండలంలో ఆర్టీసీ బస్సు ఢీకొని యువకుడు మృతి చెందాడు. చిట్యాల ఎస్ఐ ధర్మ తెలిపిన వివరాల ప్రకారం నల్లగొండలో ఆటోడ్రైవర్‌గా పనిచేస్తున్న కత్తుల అఖిల్(25) హైదరబాద్‌లో వ్యక్తిగత పనిఉండటంతో బైక్‌పై వెళ్లి తిరిగి మంగళవారం సాయంకాలం నల్లగొండకు బయలుదేరాడు. మండలంలోని పెద్దకాపర్తి శివారులోకి రాగానే హైదరాబాద్ నుంచి మధిరకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు వెనుక నుంచి బైక్‌ను ఢీకొట్టింది. ఈఘటనలో అఖిల్‌కు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. అఖిల్ తల్లి మంగమ్మ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ తెలిపారు.

బైక్ అదుపు తప్పి బాలుడు...

నూతనకల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): బైక్ అదుపుతప్పిన ఘటనలో బాలుడు మృతి చెందాడు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా నూతనకల్ మండలంలో జరిగింది. ఎస్ఐ మహేంద్రనాథ్ తెలిపిన వివరాల ప్రకారం ఆత్మకూరు(ఎస్) మండలం ఏపూరు గ్రామానికి చెందిన కల్లేపల్లి పవన్ అతడి బావమరిది లింగంపల్లి గ్రామానికి చెందిన బొప్పని రిషి(10)తో కలిసి బైక్‌పై చిన్ననేమిల క్రాస్ రోడ్డు వైపునకు వస్తున్నారు. మిర్యాల గ్రామశివారులో కుంటకట్టపై బైక్ అదుపుతప్పి పడటంతో వెనకాల కూర్చున్న రిషి రోడ్డుపై బలంగా పడిపోయాడు. దీంతో అతడి తలకు బలమైన గాయం కావడంతో చికిత్సనిమిత్తం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. రిషి తల్లి సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.


రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

గరిడేపల్లి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలంలో రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలయ్యాయి. అప్పన్నపేటకు చెందిన గుర్రం పిచ్చిరెడ్డి బైక్‌పై గరిడేపల్లి వచ్చి స్వగ్రామానికి వెళ్తున్నాడు. ముందుగా వెళ్తున్న ట్రాక్టర్ అకస్మాత్తుగా బ్రేక్ వేయడంతో వెనకాల నుంచి పిచ్చిరెడ్డి బైక్‌తో ఢీకొట్టాడు. దీంతో పిచ్చిరెడ్డికి స్వల్పగాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనంలో మిర్యాలగూడ ఆసుపత్రికి తరలించారు.

ఎస్ఎంఏఎమ్‌లకు మోక్షం

- పదేళ్ల తర్వాత పథకం ప్రారంభం
- మహిళా రైతులకు 50 శాతం సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు
- దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 29న ఆఖరు

మోత్కూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): పదేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఎట్టకేలకు సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు అందించే ఎస్ఎంఏఎమ్ (సబ్‌మిషన్ ఆఫ్ అగ్రికల్చర్ మెకనైజేషన్)కు మోక్షం లభించింది. ఈ పథకం అమలుకు కేంద్ర ప్రభుత్వం 60శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40శాతం నిధులు సమకూర్చుతోంది. శ్రమ శక్తి తగ్గిపోతుండటంతో వ్యవసాయ రంగంలో రోజురోజుకు యాంత్రీకరణ పెరిగింది. చాలా పనులు యంత్రాలతోనే చేస్తున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వాలు రైతులకు సబ్సిడీపై వ్యవసాయ పరకరాలు అందించేవి. పూర్తి డబ్బులు చెల్లించి కొనలేని సన్న, చిన్నకారు రైతులకు సబ్సిడీ పథకం ఎంతగానో ఉపకరించేది. 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయ్యాక అధికారంలోకి వచ్చిన తొలి యేడాది సబ్సిడీపై ట్రాక్టర్లు ఇచ్చింది. అప్పట్లో అవి బీఆర్ఎస్ నాయకులకే దక్కాయన్న ఆరోపలున్నాయి. ఆ తర్వాత యంత్రలక్ష్మీ (సబ్సిడీపై పరికరాలు ఇవ్వడం) పథకం నిలిపివేసింది. కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న నిధులు సద్వినియోగం చేసుకోవాలన్న తలంపుతో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రైతులకు సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు ఇవ్వాలని సంకల్పించింది. ఇప్పటికే వ్యవసాయ పరి కరాల డీలర్లతో సమావేశం నిర్వహించి, టెండర్లు పిలిచి పరి కరాల ధరలు ఖరారు చేసింది. ఇప్పుడు ప్రభుత్వం రైతులకు వ్యవసాయ పరికరాలు అందించేందుకు రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నది. ప్రభుత్వం సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు అందిస్తే తమకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని రైతులు సంతోషిస్తున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాకు రూ.3.59 కోట్ల నిధులు మంజూరు



సన్న, చిన్న కారు రైతుకు సబ్సిడీ

రాష్ట్రప్రభుత్వం ఎస్సీఎస్టీ, చిన్న, సన్నకారు, మహిళా రైతు లకు వ్యవసాయ పరికరాలపై 50 శాతం సబ్సిడీ, ఇతరరైతులకు 40శాతం సబ్సిడీ ఇవ్వనుంది. మహిళా రైతు పేరున భూమి పట్టాదారు పాసుపుస్తకం ఉండాలి. భర్తపేరున భూమి ఉండి మహిళా వ్యవసాయం చేస్తున్న మహిళా రైతుగా పరిగణించరు.

సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు అందించేందుకు ప్రభుత్వం రైతుల నుంచి దరఖాస్తులు తీసుకుంటున్నది. దరఖాస్తుల స్వీక రణకు ఈ నెల 31 చివరి తేదీ అయినప్పటికీ ఈ నెల 30, 31న సెలవులు ఉన్నందున రైతులు ఈ



	జిల్లాల వారీగా..	
జిల్లా	నిధులు	యూనిట్లు
యాదాద్రి	రూ.72లక్షలు	275
సూర్యాపేట	1.06 కోట్లు	457
నల్లగొండ	1.81 కోట్లు	820
	మొత్తం	1552

దరఖాస్తు చేసుకునే విధానం

నెల 29 లోపే దరఖాస్తు చేసు కోవాలి. రైతులు దరఖాస్తుకు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలు, ట్రాక్టర్‌కు సంబంధించిన పరికరాలు కావాల్సిన వారు ట్రాక్టర్ ఆర్‌సీ.కుల ధ్రువీకరణ పత్రం జిరాక్స్‌లు జత చేసి మండల వ్యవసాయాధికారికిగాని,సంబంధిత ఏఈఓలకు గాని అందజేయాలి.

రైతులకు మేలు



పూర్తి డబ్బు చెల్లించి వ్యవసాయ పరికరాలు కొనలేని వారికి ప్రభుత్వం సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు అందిస్తే ఎంతో మేలు కలుగుతుంది. వ్యవసాయ పరికరాల ధరలు బాగా పెరిగినందున పూర్తి డబ్బు చెల్లించి కొనే ఆర్థిక స్థోమత లేక సుమారు పదేళ్లుగా ప్రభుత్వం సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు అందిస్తుదేమోనని ఎదురు చూస్తున్నాం. ఇప్పుడు ప్రభుత్వం అవకాశం కల్పించడంతో నేను రోటవేటర్ కోసం దరఖాస్తు చేసుకున్నాను. మాకు రోటవేటర్ సబ్సిడీపై ఇచ్చి ఆదుకోవాలి.

- స్వరూప, మహిళా రైతు, బుజిలాపురం

త్వరలోనే లబ్ధిదారులను ఎంపిక చేసి పరికరాలు అందిస్తాం

ప్రభుత్వం రైతులకు సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు అందించనుంది.ఇందుకోసం జిల్లాకు రూ.72లక్షలు మంజూరయ్యాయి. ఈనిధులతో జిల్లా 275యూనిట్లు ఇవ్వ నున్నాం. సబ్సిడీ వ్యవసాయ పరికరాల కోసం రైతులు ఈ నెల 29లోపు దరఖాస్తు చేసుకోవాలి.వాటిని పరిశీలించి త్వరలోనే లబ్ధిదారులను ఎంపికచేసి, పరికరాలు పంపిణీ చేస్తాం.

-గోపాల్, జిల్లా వ్యవసాయాధికారి, యాదాద్రిభువనగిరి

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్యపూజలు



ప్రాకార మండపంలో సుదర్శన హోమం నిర్వహిస్తున్న అర్చకుడు

యాదగిరిగుట్ట, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి దివ్యక్షేత్రంలో బుధవారం నిత్య పూజలు వైభవంగా నిర్వహించారు. సుప్రభాతంతో స్వామిఅమ్మవార్లను మేల్కొలిపిన అర్చకులు గర్భగుడిలో కొలువుదీరిన స్వయంభువులను, సువర్ణ ప్రతిష్టా మూర్తులను అభిషేకించి తులసీదళాలతో సహర్చన నిర్వహించారు ప్రధానాలయం అష్టభుజి ప్రాకార మండపంలో స్వామిఅమ్మవార్ల ను అలంకరించి ప్రత్యేక వేదికపై తీర్చిదిద్ది సు దర్శన శతక పఠనాలతో హవనం నిర్వహించారు. అనంతరం గజవాహన సేవలో ఊరేగించి విష్వక్సేనుడి తొలిపూజలతో నిత్య తిరు కల్యాణోత్సవ పర్వాలు ఆగమశాస్త్రరీతిలో నిర్వహించారు. సాయంత్రం ముఖమండపంలో దర్బారు సేవోత్సవం చేపట్టిన ఆచార్యులు అంకార వెండీ జోడు సేవలు,"సహస్రనార్చనలు జరిపారు. పాతగుట్ట ఆలయంలో వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ నిత్య పూజలు కొనసాగాయి. కొండపైన శివాలయంలో శ్రీపర్వతవర్థిని రామలింగేశ్వరస్వామికి రుద్రహవనం శైవాగమ పద్ధతిలో నిర్వహించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.ఆదాయం సమకూరినట్లు ఈవో ఏ. భాస్కర్‌రావు తెలిపారు.

హుండీ లెక్కింపులో సేవా సమితి సభ్యులు

కొండకింద వ్రత మండపంలో స్వామివారి హుండీని బుధవారం నిర్వహించారు. ప్రత్యేక కాషాయ వర్ణం దుస్తులతో 200 మంది మహిళలు,తెల్లటి వస్త్రధారణతో సుమారు 400 మంది పురుషులు పాల్గొన్నారు. వీరంత వివిధ సేవా సమితులకు సంబంధించిన సభ్యులు బుధవారం లెక్కించారు. నృరసింహ, భూదాన్ పోచంపల్లి, మహాలక్ష్మి, భ్రమరాంబిక సేవా సమితి ఆధ్వర్యంలో దేవస్థానం వీరిని రద్దీ రోజుల్లో కూడా ఆలయంలో వినియోగిస్తారు.

యాదాద్రి రైతులకు ప్రకృతి రత్న అవార్డులు



ప్రకృతి రత్న అవార్డును అందుకుంటున్న మల్లయ్య, గోవర్ధన్‌రెడ్డి

భువనగిరి రూరల్, మోత్కూరు మార్చి 26(ఆంధ్రజ్యోతి) : భువనగిరి మండలం వీరవెల్లి గ్రామానికి చెందిన రైతు కంచి మల్లయ్య, మోత్కూరు మునిసిపాలిటీ పరిధిలోని ఆరెగూడెం గ్రామానికి చెందిన సేంద్రియ రైతు బిక్షపాటి గోవర్దన్‌రెడ్డి రాష్ట్రస్థాయి ఉత్తమ ప్రకృతి రత్న రైతు అవార్డును అందుకున్నారు. వీరు సేంద్రియ వ్యవసాయంలో ఆధునిక పద్ధతులను అవలంబిస్తూ తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు మల్లయ్య సాధిస్తున్నారు. దీంతో ఈనెల 25న ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్టీఆర్ జిల్లా పెనుగొంచిప్రోలు మండల కేంద్రంలో ఓ ఫంక్షన్ హాల్‌లో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉగాది పురస్కరించుకుని అవార్డు ప్రదానం చేశారు. రైతు సదస్సులో టీడీపీ విజయవాడ పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు నెట్టెం రఘురామ్, ఏపీ సేంద్రీయ ఉత్పత్తుల ధ్రువీకరణ అథారిటీ చైర్మన్ శావల దేవదత్, రైతు నేస్తం ఫౌండేషన్ చైర్మన్ పద్మశ్రీ వై.వెంకటేశ్వర్‌రావు చేతుల మీదుగా వారు అవార్డు అందుకు న్నారు.

పండుగలు, శుభకార్యాలకు దిక్సూచి పంచాంగం



పంచాంగం విడుదల చేస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు రమణారావు

భువనగిరి టౌన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : హిందువుల కాల గమనానికి, పండుగలకు శుభకార్యాలకు పంచాంగం దిక్సూచి లాంటిదని బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోచంపల్లి రమణారావు అన్నారు. భువనగిరిలో సంఘం ఆధ్వర్యంలో శ్రీ విశ్వవసు నామ తెలుగు సంవత్సర పంచాంగం బుధవారం ఆయన విడుదల చేసి మాట్లాడారు. పూర్వకాలం నుంచి నేటి ఆధునిక కాలంలో పంచాంగం ఆధారంగానే కార్యక్రమాలు చేపడుతుండటం పంచాంగం విశేషమని అన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చందుపట్ల విశ్వేశ్వరరావు, జిల్లా, పట్టణాధ్యక్షుడు ఆకవరపు రమేష్, కప్పగంతుల నాగరాజుశర్మ, పచ్చలకట్ట సోమేశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్ కొల్లూరి రాజు, దేవరకొండ నరసింహచారి, ఉమాశంకర్‌రావు, పళ్లెం కృష్ణమూర్తి, దానం రామే శ్వరరావు, మధురావ్, శ్యాంసుందర్‌రావు, మణిశర్మ పాల్గొన్నారు.

బియ్యంతో మాఫియా వ్యాపారానికి అడ్డుకట్ట

- దేశ చరిత్రలోనే సన్నబియ్యం పంపిణీ విప్లవాత్మక మార్పు
- ఉగాది రోజున హుజూర్‌నగర్‌లో సీఎంతో ప్రారంభం
- పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

హుజూర్‌నగర్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): రేషన్ సన్న బియ్యం పంపిణీతో మాఫియా వ్యాపారానికి అడ్డుకట్ట పడనుందని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం అసెంబ్లీలో మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో రూ.8వేల కోట్లతో 24 లక్షల మెట్రిక్ టన్నుల రేషన్ సన్న బియ్యాన్ని 84 శాతం మంది పేదలకు ఉచితంగా ఆరు కిలోల చొప్పున పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. దేశంలోనే తెలంగాణ ప్రభుత్వం ఒక విప్లవాత్మకమైన మార్పు తీసుకొస్తుందని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి కృషి, పట్టుదలతో ఉగాది సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 30న సన్న బియ్యం పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా పండుగ వాతావరణంలో ఈ పథకాన్ని ప్రారంభించాలని ప్రజా ప్రతినిధులను ఉత్తమ్ కోరారు. హుజూర్‌నగర్‌లో రేవంత్‌రెడ్డి ఈ పథకాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. రేషన్ దొడ్డు బియ్యంతో మాఫియా నడిచిందని, డీలర్లు, లబ్ధిదార్లు కూడా బియ్యాన్ని విక్రయించారన్నారు. అందుకే ప్రజలకు నాణ్యమైన బియ్యాన్ని అందిచనున్నామని తెలిపారు.



అసెంబ్లీలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

పాస్టర్‌ను హత్య చేసిన దుండగులను శిక్షించాలి

బాప్టిస్టు చర్చి అధ్యక్షుడు టీఎస్ క్రిస్టోఫర్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బాప్టిస్టు చర్చి అధ్యక్షుడుటీఎస్ క్రిస్టోఫర్

నల్లగొండ క్రైం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని రాజమండ్రిలో దైవ సేవకుడు, పాస్టర్ పగడాల ప్రవీణ్‌ను హత్య చేసిన దుండగులను వెంటనే అరెస్టు చేసి చట్ట ప్రకారం కఠినంగా శిక్షించాలని నల్లగొండ బాప్టిస్టు చర్చి అధ్యక్షుడు టీఎస్ క్రిస్టోఫర్, చర్చి పాస్టర్ బి.ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం నల్లగొండ పట్టణంలోని గడియారం సెంటరులో ఉన్న చర్చిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రస్తుతం సమాజంలో పాస్టర్లు, క్రైస్తవులు, చర్చిలపై దాడులు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాజమండ్రిలో పాస్టర్ పగడాల ప్రవీణ్‌ను కొంతమంది దుండగులు ప్రణాళిక ప్రకారమేహత్య చేశారని ఆరోపించారు. ఈ హత్యను తీవ్రంగా ఖండిస్తున్నామని, ఇలాంటి దాడులు, హత్యలు, చర్చిల కూల్చివేతలను అడ్డుకునేందుకు క్రైస్తవ సమాజం అంతా ఏకం కావాలని పిలుపునిచ్చారు. నిందితులను ఏపీ ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని, ప్రభుత్వాలు, చట్టాలపై తమకు పూర్తి నమ్మకం, గౌరవం ఉందన్నారు. క్రైస్తవులకు ప్రభుత్వాలు రక్షణ కల్పించాలని, సురక్షితంగా ఆయా సంఘాల్లో ప్రార్థన చేసుకునేందుకు అవకాశం కల్పించాలని కోరారు. క్రైస్తవ లోకం ఆధ్యాత్మికమైన దైవజనుడిని కోల్పోయిందని, క్రైస్తవులను, చర్చిలను నిర్లక్ష్యం చేయకుండా వారి అభ్యున్నతికి ప్రభుత్వాలు సహకారం అందించాలని అన్నారు. ఈ విషయంపై సీఎం రేవంత్‌రెడ్డితో పాటు రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి కూడా విన్నవించి ప్రవీణ్‌ను హత్య చేసిన దుండగులపై చర్యలు తీసుకునేలా ఒత్తిడి తెస్తామన్నారు. సమావేశంలో పాస్టర్ జాకబ్, ఆర్‌సీఎం మెంబర్ పసల శౌరయ్య, మాజీ గ్రంధాలయ సంస్థ చైర్మన్ రేకల భద్రాద్రి, మోజెస్, ఇసాక్, ప్రదీప్ శామ్యూల్, ఆశయ్య, ఎస్పీ జయప్రకాష్ పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

మిర్యాలగూడ, మార్చి 26(ఆంధ్రజ్యోతి):వ్యక్తి ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన బుధవారం రాత్రి నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక బంగారుగడ్డకు చెందిన గుంటోజు మధుబాబు మద్యానికి బానిసై డబ్బు కోసం వేధిస్తున్నందున టూటౌన్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చింది. తెల్లవారిన తర్వాత మాట్లాడతామని పోలీసులు వారిని పంపేశారు. అర గంట తర్వాత పోలీస్‌స్టేషన్ ప్రాంతానికి మధుబాబు వచ్చి తన వెంట తెచ్చుకున్న పెట్రోల్ బాటిల్ మూత ఓపెన్ చేసి ఒంటిపై పోసుకుని నిప్పంటించుకున్నాడు. గమనించిన స్థానికులు, పోలీసులు మంటలను ఆర్పివేసి ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఆతడి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం నల్లగొండకు తరలించారు. ఈ ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పనిచేయని టిమ్స్..ఆగిన ఆర్టీసీ బస్సు

మోత్కూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): తొర్రూరు నుంచి హైదరాబాద్ వెళ్తున్న హైదరాబాద్-2 డిపో ఆర్టీసీ బస్సులో టికెట్లు ఇచ్చే టిమ్స్ మిషన్ బుధవారం మొరాయించింది. టికెట్లపై ప్రింటు రాకపోవడంతో యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మునిసిపాలిటీ పరిధిలోని ధర్మాపురం వద్ద బస్సును నిలిపివేశారు.. తొర్రూరు నుంచి మోత్కూరు, వలిగొండ, చౌటుప్పల్ మీదుగా హైదరాబాద్ వెళ్త బస్సులో సుమారు 50 ప్రయాణికులు ఉన్నారు. మోత్కూరు బస్టాండులో బస్సు ఎక్కిన ప్రయాణికులకు కండక్టర్ టికెట్లు ఇవ్వడానికి ప్రయత్నించగా టికెట్లపై ప్రింటు రాలేదు. దీంతో ధర్మాపురం వద్ద బస్సు నిలిపివేయడంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. ఈ విషయాన్ని హైదరాబాదు-2 డిపో మేనేజరు దృష్టికి తీసుకెళ్లగా టికెట్ల మిషన్‌లో ప్రింటు అవుతున్నందున బయటకు ప్రింటు రాని పేపరుపై రాసి ఇచ్చి బస్సును హైదరాబాద్ గమ్యస్థానానికి తీసుకరమ్మని చెప్పడంతో సమస్య పరిష్కారమైంది.

జవహర్ నవోదయ ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదల

పెద్దవూర, మార్చి 26(ఆంధ్రజ్యోతి): పెద్దవూర మండలం చలకుర్తి నవోదయ విద్యాల యంలో 6వ, 9వ తరగతిలో ప్రవేశాల కోసం నిర్వ హించిన ప్రవేశ పరీక్షా ఫలితాలు విడుదలైనట్లు ప్రిన్సిపాల్ ఆర్.నాగభూషణం బుధవారం తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో తాత్కా లికంగా ఎంపికైన 80మంది విద్యార్థుల వివరాలు, 9వ తరగతిలో ఎంపికైన 11 మంది విద్యార్థుల వివరాలను ఆయన వెల్లడించారు. ఎంపికైన విద్యార్థులు సంబంధిత వెబ్‌సైట్ నుంచి అడ్మిషన్ ఫారాలను డౌన్‌లోడ్ చేసుకుని వివరాలను పూర్తిగా నింపి అవసరమైన అన్ని సర్టిఫికెట్లు ఏర్పాటు చేసుకుని డాక్యుమెంట్ వెరిఫికేషన్ కోసం సిద్ధంగా ఉండాలన్నారు. ప్రవేశానికి అన్ని సంబంధించి ఫారాలను అప్లికేషన్ పొందుపరిచిన చిరునామాకు రిజిస్టర్ పోస్ట్ ద్వారా పంపుతామన్నారు.

భూవివాదంపై ఆర్డీవో విచారణ



నార్కట్‌పల్లి తహసీల్దార్ కార్యాలయంలో విచారణ చేస్తున్న ఆర్డీవో అశోక్‌రెడ్డి

నార్కట్‌పల్లి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం ఎల్లారెడ్డిగూడెం రెవెన్యూ శివారు పరిధిలోని సర్వే నెం.729లో నెల కొన్న భూ వివాదంపై నల్లగొండ ఆర్డీవో యానాల అశోక్‌రెడ్డి బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో విచారణ చేశారు. 729 సర్వే నెంబర్‌లో ఎ1.06ల భూమి వంగూరి సైదమ్మ నుంచి ముప్పిడి చంద్రకళ కొనుగోలు చేసింది. కానీ నల్లగొండ పట్టణానికి యూసుఫుద్దీన్ కుమారులు ఫక్రుద్దీన్, మెయినొద్దీన్‌లు ఆ భూమిపైకి వెళ్లి తమ వారసుల భూమిని అక్రమంగా పట్టా చేసుకున్నారని ఆరోపిస్తూ ఆ భూమి చుట్టూ వేసిన కడీలను ధ్వంసం చేశారు. ఈ ఘటనపై బాధితురాలు కలెక్టర్‌కు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. ఆర్వోఆర్ ద్వారా విక్రయించిన భూమిని తిరిగి అక్రమంగా పట్టాలు చేయించుకుని పొందిన పాస్ పుస్తకాలను రద్దు చేయాలని, అదే విధంగా క్షేత్రస్థాయిలో విచారణ చేయకుండా పాసు బుక్‌లను జారీ చేసిన రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఫిర్యాదు అందింది. దీంతో విచారణ చేసి నివేదిక అందజేయాలని కలెక్టర్ ఇచ్చిన ఆదేశాల మేరకు బుధవారం నార్కట్‌పల్లి తహసీల్దార్ కార్యాలయానికి ఇరుపక్షాలను ఆర్డీవో పిలిచి అధికారుల సమక్షంలో రికార్డుల యుతంగా విచారణ చేశారు. సర్వే నెంబర్ 729లో 1954-55 నుండి 2017-18 సంవత్సరం వరకు పూర్తి విస్తీర్ణం మొత్తం ఎ9.14లు మాత్రమే ఉంది. కానీ 2018 సంవత్సరంలో ఖాస్రా విస్తీర్ణం మరో ఇద్దరు పట్టాదారులను చేర్చగా మొత్తం ఎ11.27లుగా విస్తీర్ణం పెరిగిన వైనంపైనా ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న అధికారులు, భూమి యాజమాన్య హక్కుపై ఆశ్రయించిన ఇరుపక్షాల వాదనను ఆర్డీవో విన్నారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ సర్వే నెంబర్ 729 భూవివాదంపై విచారణ జరిపిన నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామన్నారు. ఈ విచారణలో తహసీల్దార్ ఎల్.వెంకటేశ్వర్‌రావు, నాయబ్ తహసీల్దార్ రామకృష్ణ, సీనియర్ అసిస్టెంట్ విజయారెడ్డి, ఆర్ఐలు తరుణ్, భవాని, సర్వేయర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

సాగర్ సమాచారం

పూర్తిస్థాయి నీటి మట్టం	590.00 అడుగులు
టీఎంసీలు	312.0450
ప్రస్తుత నీటి మట్టం	521.20
టీఎంసీలు	151.4734
ఎడమకాల్వకు నీటి విడుదల	8.367
కుడికాల్వకు	6.041
విద్యుత్ కేంద్రం ద్వారా	నిల్
క్రస్ట్ గేట్ల ద్వారా	నిల్
ఎస్ఎల్‌బీసీ ద్వారా	1,800 క్యూసెక్కులు
వరద కాల్వ ద్వారా	నిల్
ఇన్‌ఫ్లో	25,036
అవుట్‌ఫ్లో	15,508

పులిచింతల ప్రాజెక్టు

పూర్తిస్థాయి నీటి నిల్వ	45.77 టీఎంసీలు
ప్రస్తుత నీటి నిల్వ	33.66 టీఎంసీలు
గేట్ల ద్వారా	నిల్
అవుట్‌ఫ్లో	300 క్యూసెక్కులు
ఇన్‌ఫ్లో	300 క్యూసెక్కులు

మూసీ నీటిమట్టం

పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
టీఎంసీలు	4.46 (టీఎంసీలు)
ప్రస్తుత నీటి మట్టం	627.59 అడుగులు
టీఎంసీలు	1.10 (టీఎంసీలు)
కాల్వలకు విడుదల	568.17 క్యూసెక్కులు
ఇన్‌ఫ్లో	నిల్
అవుట్‌ఫ్లో	606.12క్యూసెక్కులు

ప్రజా సమస్యలను మరిచిన కేంద్ర ప్రభుత్వం

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

రామన్నపేట, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ మతం పేరుతో ప్రజల మధ్య వైషమ్యాలు సృష్టిస్తూ ప్రజల్లో విభజన తెచ్చి ప్రజా సమస్యలపై పోరాడకుండా కుట్ర చేస్తోందని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి ఆరోపించారు. బుధవారం యాదాద్రి భువనగిరి జిల్లాలో సీపీఎం రామన్నపేట మండల కమిటీ ఆధ్వర్యంలో మండల సమగ్రాభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహి"స్తున్న ప్రజా చైతన్య పాదయాత్ర ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం తన వ్యక్తిగత ఎజెండా అయిన మతోన్మాదాన్ని పెంచి పోషిస్తూ ప్రజా సమస్యలను గాలికి వదిలేసిందన్నారు. డీలిమిటేషన్‌లో భాగంగా దక్షిణాది రాష్ట్రాలను పార్లమెంట్‌లో ప్రాతినిధ్యాన్ని తగ్గించి బీజేపీ ఇతర రాష్ట్ర ప్రజల్ని మోసం చేస్తోందన్నారు. కేంద్రం నుంచి గ్రామాలకు రావాల్సిన అభివృద్ధి నిధులు నిర్వీర్యం చేస్తుందన్నారు.

హామీలు నెరవేర్చే వరకు పోరాటం ఆగదు

రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు సీపీఎం పోరాటం ఆగదని ఆ పార్టీ యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మేక అశోక్‌రెడ్డి, పాదయాత్ర బృందం జల్లెల పెంటయ్య, మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం, మండల కార్యదర్శి వర్గ సభ్యులు బోయిని ఆనంద్, కందుల హనుమంతు, గొరిగి సోములు, బొడిగె రజిత, వేముల సైదులు, కొమ్ము అంజమ్మ, మేడి గణేష్ తదితరులు ఉన్నారు.



ప్రజాచైతన్య పాదయాత్రలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

ఎస్ఏ పోస్టులను బీఈడీ అభ్యర్థులతోనే భర్తీ చేయాలి

కోదాడటౌన్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): స్కూల్ అసిస్టెంట్(ఎస్ఏ)ల పోస్టులను బీఈడీ అభ్యర్థులతోనే భర్తీ చేయాలని బీఈడీ అభ్యర్థుల సంఘం కోదాడ నియోజకవర్గ అధ్యక్షుడు శివాజీనాయక్ డిమాండ్ చేశారు. పదోన్నతుల ప్రక్రియకు వ్యతిరేకంగా బుధవారం సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణ పరిధిలోని బాపూజీ శాఖ గ్రంథాలయం ఎదుట అభ్యర్థులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీనియర్ ఎస్‌జీటీలకు 70శాతం మేర పదోన్నతులు కల్పించడంతో బీఈడీ అభ్యర్థులకు తీరని అన్యాయం జరుగుతోందని అన్నారు. టీచర్ పోస్టుల్లో 30 శాతం ఖాళీలు, పదోన్నతులు కల్పించడంపై ఆవేదన వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాల్లో స్కూల్ అసిస్టెంట్ పోస్టులను 70 శాతం బీఈడీ అభ్యర్థులతోనే భర్తీ చేస్తున్నారని, అదే విధానాన్ని తెలంగాణ రాష్ట్రంలో అమలు చేయాలని డిమాండ్ చేశారు.పదోన్నతుల అంశంపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుని బీఈడీ అభ్యర్థులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీఈడీ అభ్యర్థులు రాంబాబు, శ్రీను, సందీప్, నరేష్, శోభ, సారిక, సుమ, తులసి, రమేష్, శ్రీరాములు, శ్రీకాంత్, రామారావు, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

'పది' ప్రశ్నాపత్రం లీకేజీకి రాజకీయరంగు

(5వపేజీ తరువాయి)

క్రిశాంక్ ఉద్దేశపూర్వకంగా తమను అవమానించేలా వాటిని ఫార్వర్డ్ చేశారని కాంగ్రెస్ నేతలు రజిత, నరేందర్, శ్రీనివాస్ నకిరేకల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసులు నమోదుచేశారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం సహా కేసులు నమోదవడంతో బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతల నడుమ తీవ్రస్థాయిలో పరస్పరారోపణలు వెల్లువెత్తాయి. కేటీఆర్, ఇతర బీఆర్ఎస్ నేతలపై కేసులు పెడితే సహించబోమని, చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే చూస్తూ ఊరుకునేది లేదని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, నియోజకవర్గ నాయకులు ప్రసన్నరాజ్ తదితరులు హెచ్చరించారు. అయితే దమ్ముంటే నేరుగా ఎదుర్కోవాలే తప్ప తప్పుడు ఆరోపణలు చేస్తే సహించేంది లేదని ఎమ్మెల్యే వీరేశం హెచ్చరించారు. ఇరుపార్టీల నాయకులు ఎక్కడికక్కడ పరస్పర ఆరోపణలు, హెచ్చరికలతో బుధవారం రోజంతా రాజకీయ్యబ హడావిడి నెలకొంది.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

మర్రిగూడ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నిరుపేద కుటుంబాలకు అందిస్తున్న కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ బక్క శ్రీనివాస్ కోరారు. తహసీల్దార్ కార్యాలయంలో షాదీముబారక్, కల్యాణలక్ష్మీ పథకం ద్వారా 47 మందికి మంజూరైన చెక్కులను బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో అధికారులు, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఆస్తి పన్ను వడ్డీ బకాయిపై 90శాతం రాయితీ

రామగిరి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఆస్తి పన్ను ఈ నెల 31వ తేదీలోగా చెల్లిస్తే వడ్డీ బకాయిలో 90 శాంత రాయితీ సౌకర్యం కల్పిస్తున్నట్లు మునిసిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని బకాయిదారులు సద్వినియోగపరుచుకోవాలని కోరారు. అయితే ఇప్పటికే ఆస్తి పన్ను చెల్లించిన వారు ఏ మాత్రం ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వారికి వచ్చే ఆర్థిక సంవత్సరంలో 90 శాతం రాయితీ సర్దుబాటు చేస్తామని తెలిపారు.

చిన్నారులకు వేసవిలో శిక్షణ



● డీవైఎస్‌వో కుంభం నర్సిరెడ్డి

జిల్లాలో వేసవి శిక్షణా శిబిరాల కోసం 14 సంవత్సరాలలోపు బాలబాలికలకు శిక్షణ కోసం వ్యాయామ ఉపాధ్యాయులతో పాటు సీనియర్ క్రీడాకారుల నుంచి దరఖాస్తులు కోరుతున్న నేపథ్యంలో డీవైఎస్‌వో కుంభం నర్సిరెడ్డితో ఆంధ్రజ్యోతి 'ఇంటర్వ్యూ'

-(ఆంధ్రజ్యోతి-నల్లగొండ స్పోర్ట్స్)

ఇంటర్వ్యూ Interview

ఆంధ్రజ్యోతి: వేసవి శిక్షణా శిబిరాలు ఎప్పటి నుంచి నిర్వహిస్తారు?

డీవైఎస్‌వో: గ్రామీణ బాలికలల్లో క్రీడా నైపుణ్యాలను పెంపొందించేందుకు మే 1 నుంచి 31వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా వేసవి శిక్షణా శిబిరాలను నిర్వహిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: వేసవి శిక్షణా శిబిరాలల్లో శిక్షణా పొందేందుకు ఎన్ని సంవత్సరాల బాలబాలికలు అర్హులు?

డీవైఎస్‌వో: వేసవి శిక్షణా శిబిరాల్లో 14 సంవత్సరాల లోపు బాలబాలికలకు తర్ఫీదు ఇస్తాం.

ఆంధ్రజ్యోతి: జిల్లాలో ఎన్ని వేసవి శిక్షణా శిబిరాలను ఏర్పాటు చేశారు?

డీవైఎస్‌వో: జిల్లాలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాలల్లో 10 వేసవి క్రీడా శిక్షణా శిబిరాలను ఏర్పాటు చేశాం.

ఆంధ్రజ్యోతి: ఏ క్రీడా అంశంలో శిక్షణ ఇస్తున్నారు?

డీవైఎస్‌వో: ఎంపిక చేసిన శిక్షణా శిబిరాల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, పుట్‌బాల్, హ్యాండ్‌బాల్, అథ్లెటిక్స్ వంటి అంశాల్లో శిక్షణ ఇస్తాం.

ఆంధ్రజ్యోతి: ఈ శిక్షణా శిబిరాలను ఎవరు నిర్వహిస్తారు?

డీవైఎస్‌వో : ఈ శిక్షణా శిబిరాల్లో జిల్లాలో ఉత్సాహవంతులైన, ఎంపికైన వ్యాయామ ఉపాధ్యాయులు, సీనియర్ క్రీడాకారులు నిర్వహిస్తారు.

ఆంధ్రజ్యోతి: నెల రోజుల పాటు వేసవి శిక్షణా శిబిరాలను నిర్వహించే శిక్షకులకు వేతనం ఎంత చెల్లిస్తారు?

డీవైఎస్‌వో: శిక్షణా శిబిరాలను నిర్వహించే శిక్షకులకు శిబిరం ఒక్కరికి రూ.4వేల గౌరవ వేతనం చెల్లిస్తాం.

ఆంధ్రజ్యోతి: శిబిరాల నిర్వహణకు వ్యాయామ ఉపాధ్యాయులు, సీనియర్ క్రీడాకారులను ఎంపిక చేశారా?

డీవైఎస్‌వో: గ్రామీణ ప్రాంతాల్లో శిబిరాలను నిర్వహించేందుకు అర్హులైన పీఈటీలను, సీనియర్ క్రీడాకారుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: శిక్షకుల నుంచి ఎప్పటి వరకు దరఖాస్తు చేసుకోవాలి?

డీవైఎస్‌వో: ఏప్రిల్ 5వ తేదీలో క్రీడల వివరాలు, గ్రామం, నిర్వహణ ప్రదేశం వివరాలు ఇవ్వాలి.

ఆంధ్రజ్యోతి: వివరాల కోసం ఎవరిని సంప్రందించాలి?

డీవైఎస్‌వో: డీవైఎస్‌వో కార్యాలయంలో సంప్రదించాలి.

సాంబశివుడి ఆశయాలు సాధించాలి



సాంబశివుడి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

నల్లగొండ టౌన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు పార్టీ మాజీ రాష్ట్ర కార్యదర్శి దివంగత కొనపురి సాంబశివుడు ఆశయాలు సాధించాలని వైఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు చల్లా కోటేష్ యాదవ్, రాష్ట్ర సలహాదారు బెల్లి నాగరాజు యాదవ్ కోరారు. సాంబశివుడి 14వ వర్ధంతి సందర్భంగా జిల్లాకేంద్రంలోఆయన చిత్రపటానికి పూలమాలలేసి నివాలర్పించారు. భువనగిరి జిల్లాకు సాంబశివుని పేరు పెట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం రాష్ట్ర నాయకులు చీర పంకజ్‌యాదవ్, బొబ్బల గోపాలకృష్ణ, బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు దుడుగు లక్ష్మీనారాయణ, అల్లి సుభాష్ ,గంగుల చందు వంశీ, వజ్జ రమేష్, అజయ్, డాక్టర్ అంజిబాబు యాదవ్, జంగయ్య యాదవ్, గుండెబోయిన కిరణ్, కంబాలపల్లి ఉపేందర్, నల్లబెట్టి పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాలకు అడ్డుకట్ట



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ విష్ణుమూర్తి

కనగల్, మార్చి 26:(ఆంధ్రజ్యోతి): ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని ఎస్ఐ విష్ణుమూర్తి అన్నారు. మండలకేంద్రంలో బుధవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. దుకాణాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. మైనర్లకు వాహనాలు అప్పగించొద్దన్నారు. యువత గంజాయి వంటి మత్తు పదార్థాలకు అలవాటు కావొద్దని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ సర్వరాజ్‌ఖాన్ రైటర్ సురేష్, పీసీలు రాంనర్సింహ్మా, రవీందర్‌రెడ్డి, బుర్హానుద్దీన్ సైదులు, రమేష్‌గౌడ్ పాల్గొన్నారు.

అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

చిట్యాలరూరల్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని చిట్యాల వ్యవసాయ మార్కెట్ చైర్‌పర్సన్ నర్రా వినోదమోహన్‌రెడ్డి అన్నారు, మండలంలోని ఎలికట్టె, వనిపాకల, వట్టిమర్తి పరిధిలోని గుమ్మళ్ళబావిలో బుధవారం సీసీరోడ్ల నిర్మాణ పనులకు బుధవారం శంకుస్థాపన చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజాపాలన కొనసాగుతోందన్నారు. ఉచిత విద్యుత్, మహిళలకు, ఉచిత బస్సు ప్రయాణం, రైతులకు రైతుభరోసా, ఆరోగ్యశ్రీ వైద్యసేవలుతో పాటు సంక్షేమ పథకాలు కొనసాగుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్పీ జయలక్ష్మి, పీఆర్ ఏఈ సందీప్‌రెడ్డి, కాటం వెంకటేశం, నాయకులు గుడిపాటి లక్ష్మీనర్సింహ్మా, జడల చిన్న మల్లయ్య, కొండకింది వెంకట్‌రెడ్డి, పరమేష్, యాదగిరిరెడ్డి తదితరులు ఉన్నారు.

భక్తిభావం అలవర్చుకోవాలి

మర్రిగూడ, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ భక్తి భావం అలవర్చుకోవాలని లక్ష్మీనర్సింహస్వామి ఆలయ చైర్మన్ ఏడుదొడ్ల నర్సింహారెడ్డి అన్నారు. మండలంలోని అజిలాపురం బుగ్గలక్ష్మీనర్సింహాస్వామి బ్రహ్మోత్సవాలను బుధవారం భక్తులు రథోత్సవం నిర్వహించారు. ఆలయ అభివృద్ధికి సహకరించాలని కోరారు. అంతకముందు పూజార్లు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించగా భక్తులు కానుకలు సమర్పించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెన్నమనేని రవీందర్‌రావు, మాజీ సర్పంచ్‌లు దండేటికార్ అనసూయ అంజయ్య, లాలూ నాయక్, శ్రీరామదాసు శ్రీనివాస్, ఎలిమినేటి సత్తిరెడ్డి, ఉప్పునూతల మల్లయ్య, నగేష్, రవి, ఏర్పుల శ్రీశైలం, వెంకటంపేట బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

ధర్మబిక్షం ఆశయసాధనకు కృషి

చిట్యాల, మార్చి26, (ఆంధ్రజ్యోతి): మాజీ ఎంపీ బొమ్మగాని ధర్మబిక్షం ఆశయ సాధనకు కృషిచేయాలనీ సీపీఐ మండల కార్యదర్శి ఎండీ అక్బర్ కోరారు. ధర్మబిక్షం వర్థంతి సందర్బంగా బుధవారం చిట్యాలలలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి ఎస్‌కే షరీఫ్, దేశగోని బాలరాజు, గుండాల సత్తయ్య, కూనూరు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మునుగోడు: మాజీ ఎంపీ ధర్మబిక్షం వర్థంతిని మునుగోడులో ఘనంగా నిర్వహించారు. బస్టాండ్ వద్ద ఉన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి చాపల శ్రీను, బొమ్మరగోని లాలు, గోసుకొండ లింగయ్య, దుబ్బ వెంకన్న, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మర్రిగూడ: మర్రిగూడ జరిగిన కార్యక్రమంలో సీపీఐ నాయకులు బూడిద సురేష్, ఎరుకల నిరంజన్, యాదగిరి, అంజయ్య, కేశవులు పాల్గొన్నారు.

చేనేత కార్మికులకు క్లస్టర్ దోహదం

మునుగోడు, మార్చి 26(ఆంధ్రజ్యోతి): బ్లాక్‌స్థాయి క్లస్టర్లు చేనేత కార్మికులకు దోహద పడతాయని ఏడీవో డీ. గోపాల్ తెలిపారు. మునుగోడు చేనేత సహకార సంఘం 78వ వార్షిక, 87వ జరల్ బాడీ మహాసభలో బుధవారం మాట్లాడారు. మునుగోడు చేనేత సహకార సంఘానికి కేంద్ర ప్రభుత్వం చేనేత బ్లాక్‌స్థాయి క్లస్టర్ మంజూరు చేసిందన్నారు. కార్యక్రమంలో సహకార సంఘం ఇన్‌ఛార్జి అధ్యక్షుడు కర్నాటి లింగయ్య, మేనేజర్ కందగట్ల గణేష్, సంగిశెట్టి పరమేశం, లక్ష్మమ్మ, భాస్కర్, జగన్నాథం, పరమేశం, నరేందర్, వెంకయ్య ఉన్నారు.

బ్యాంక్ కోడ్‌తో దరఖాస్తుదారులకు తంటా

● అప్‌డేట్ కాని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ ● పాత కోడ్‌లోనే ఆన్‌లైన్ దరఖాస్తులు



కనగల్, మార్చి 26:(ఆంధ్రజ్యోతి): రాజీవ్ యువ వికాసం పథకం కింద సబ్సిడీ రుణాలు పొందేందుకు ప్రభుత్వం ఈ నెల 17 నుంచి ఏప్రిల్ 5వ తేదీ వరకు నిరుద్యోగుల నుంచి దరఖాస్తులు ఆహ్వానించింది. ఏపీజీవీబీ ఆధునికీకరణలో భాగంగా ఇటీవల టీజీబీగా మారింది. పేరుతో పాటు బ్యాంక్ ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ కూడా మారింది. బ్యాంకు పేరు మారి మూడు నెలలు అవుతున్నా ఇంకా ఆన్‌లైన్‌లో టీఎంఎంఎస్ సైట్‌లో బ్యాంక్ పాత లోగో, పాత ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ కన్పిస్తోంది. ఈ క్రమంలో రాజీవ్ యువ వికాసం పథకానికి ఆన్‌లైన్ దరఖాస్తుల్లోనూ పాత కోడే వస్తోంది. కొంతమంది ఇప్పటికే దరఖాస్తు చేసుకోగా మరికొంత మంది దరఖాస్తు చేయాలా వద్దా అనే సందిగ్ధంలో ఉన్నారు. పాత ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్‌తో దరఖాస్తు చేసుకున్న వారు తమకు రుణాలు అందుతాయా లేదోనని ఆందోళన చెందుతున్నారు. బ్యాంక్ కొత్త కోడ్ యాక్టివేట్ కాకపోవడంతో చాలా మంది రైతులకు రుణాలు మాఫీ కాక నష్టపోయారని అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇదే సమస్యను ఇటీవల దివ్యాంగులూ ఎదుర్కొన్నారు. వారు వివిద పథకాలకు దరఖాస్తులు చేసుకునే అవకాశం కోల్పోయారు. కనగల్ టీజీబీ పరిధిలో సుమారు 15గ్రామాలు ఉన్నాయి. ఆయా గ్రామాలకు చెందిన వారు సబ్సిడీ రుణాలు ఈ బ్యాంకు ద్వారానే పొందాల్సి ఉంటుంది. బ్యాంక్ కొత్త ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ ఆన్‌లైన్‌లో యాక్టివేట్ కాలేదు. ఒకసారి దరఖాస్తు చేసుకున్న తర్వాత తప్పులను సరిచేసుకునే (ఎడిట్) అవకాశం లేదు. ఈ సమస్య రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నా సంబంధిత ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దరఖాస్తులకు గడువు దగ్గర పడుతోందని నిరుద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ అప్‌డేట్ చేయాలి



రుణ సదుపాయం కోరుతూ రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకున్నాను. టీజీబీ కొత్త ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ ఇంకా అప్‌డేట్ కాలేదు. పాత కోడ్ మారకపోతే మంజూరైన రుణాలు చేతికందే అవకాశం ఉండదు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలి.

రాయల క్రిష్ణ, కనగల్ గ్రామం, దరఖాస్తుదారుడు.

రైతులను ఆదుకోవాలి



ఎండిన పొలాలను పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నాయకుడు ప్రసన్నరాజ్

కట్టంగూరు, మార్చి 26(ఆంధ్రజ్యోతి): పంట పొలాలు ఎండిన రైతులకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నల్లగాటి ప్రసన్నరాజ్ డిమాండ్ చేశారు. మండలంలోని మునుకుంట్లలో ఎండిన పంట పొలాలను బుధవారం పరిశీలించారు. చెరువుల్లో, కుంటల్లో నీరు లేక భూగర్భజలాలు అడుగంటి బోర్లు ఎండిపోయాయని, దీంతో వరి పొలాలు పూర్తిగా ఎండిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో పంట పొలాలు పచ్చగా ఉండి రైతులు ఆనందంగా ఉన్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో కరువు ఏర్పడినట్లుగా ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా రైతులకు రుణ మాఫీ, రైతుభరోసా సక్రమంగా ఇవ్వకుండా రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం నిండ ముంచిందన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ చైర్మన్ నూక సైదులు, ఉట్కూరి ఏడుకొండల్, గుండాల మల్లేష్, రమేష్, ముప్పిడి యాదయ్య, చిట్యాల రాజిరెడ్డి, బిక్షం, శశిపాల్‌రెడ్డి, సోములు, శివ, శంకరయ్య ఉన్నారు.

గ్రామాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలి



కేతేపల్లిలో వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

నాంపల్లి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి నాంపల్లి చంద్రమౌళి అన్నారు. పార్టీ ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. రైతులకు ఎండిన వరికి ఎకరానికి రూ.30వేల చొప్పున నష్టపరిహారం ఇవ్వాలన్నారు. రైతాంగానికి సాగు నీరు అందించి ఆదుకోవాలన్నారు. ఎండిన వరి చేలను పరిశీలించి ఎకరాకు రూ.30వేల నష్టపోయారని ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యుడు వాసిపాక ముత్తిలింగం, కొమ్ము లక్ష్మయ్య, పెరమండ్ల రాజు, దామేర రవి, సైదులు, వెంకటయ్య, ఎల్లేష్ పాల్గొన్నారు.

కేతేపల్లి: గ్రామాల్లో ప్రజా సమస్యలు పేరుకుపోయాయని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బొజ్జ చినవెంకులు ఆందోళన వ్యక్తం చేశారు. కేతేపల్లిలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. ప్రజా సమస్యలపై పోరుబాట కార్యక్రమంలో భాగంగా మండల కమిటీ 20రోజులుగా నిర్వహించిన సర్వేలో ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలు తమ దృష్టికి వచ్చాయన్నారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ సత్తార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి చింతపల్లి లూర్దుమారయ్య, కోట లింగయ్య, సీహెచ్.నాగయ్య, శ్రీను, అల్లి ప్రభాకర్, వి.వెంకన్న, ఎస్.సత్తయ్య, వి. సౌడయ్య, మల్లయ్య, సుగుణమ్మ పాల్గొన్నారు.

గట్టుప్పల్: మండలంలో అర్హులైన పేదలందరికీ ఇళ్లు, ఇళ్ల స్థలాలు, రేషన్ కార్డులు ఇవ్వాలని సీపీఎం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు కర్నాటి మల్లేశం, చాపల మారయ్య, కర్నాటి సుధాకర్, కర్నాటి వెంకటేశం, రాచమల్ల వెంకట్ రెడ్డి, అచ్చిన శ్రీనివాస్, వల్లూరి శ్రీశైలం, పి. యాదగిరి, రావుల నరసింహ, బుచ్చిరెడ్డి, సైదులు, శ్రీనునాయక్, ఖమ్మం యాదయ్య, శంకరయ్య, భారతమ్మ, లక్ష్మమ్మ, రాములమ్మ తదితరులు పాల్గొన్నారు

శాలిగౌరారం: ప్రజా సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని సీపీఎం మండల కార్యదర్శి చలకాని మల్లయ్య అన్నారు. పార్టీ ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు మక్క బుచ్చి రాములు, కల్లూరి లింగయ్య, సిరిపంగి రాములు, సైదుల శ్రీను, బల్లెం వెంకటయ్య, అన్నెబోయిన కిరణ్, చలకాని కుమార్, సిరిపంగి అంజి, బల్లెం ముత్తయ్య, లింగమల్లు, పెరుమాండ్ల శ్రీను పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులు పారదర్శకంగా చేపట్టాలి



మర్రిగూడ: తమ్మడపల్లిలో ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీవో

మర్రిగూడ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం పనులను పారదర్శకంగా చేపట్టాలని ఎంపీడీవో గరికెల మున్నయ్య అన్నారు. మండలంలోని ఎరగండ్లపల్లి, తమ్మడపల్లి గ్రామాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనులను బుధవారం ఆయన పరిశీలించారు. కూలీలకు సంబంధించిన మాస్టర్‌రోల్‌ను తనిఖీ చేశారు. అంతకముందు ఉపాధి కూలీలతో వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రోజుకు కనీస వేతనం రూ.300 పెంచిందని అందుకు గానూ కూలీలు ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉపాధి హామీ పథకం కూలీలు వచ్చే విధంగా అధికారులు అవగాహన కల్పించాలని ప్రతి ఒక్కరికీ వంద రోజులు ఉపాధి పనులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట తమ్మడపల్లి, ఎరగండ్లపల్లి గ్రామాల కార్యదర్శులు ఉన్నారు.

గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలి

శాలిగౌరారం: గ్రామాల్లో ఈ వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని ఎంపీడీవో గార్లపాటి జ్యోతి లక్ష్మి ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు ఉపాధి హామీ సిబ్బందితో బుధవారం సమీక్షా సమావేశం జరిగింది . ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నర్సరీలలో 100శాతం మొక్కలు ఉండేలా చూసి జూన్ నెలలో మొక్కలు నాటడానికి సిద్ధంగా ఉంచాలని సూచించారు. అన్ని గ్రామ పంచాయతీల్లో ప్రజలకు నీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బంది రాకుండా చూడాలన్నారు. నీరు వృథా కాకుండా వాటర్ లీకేజీలు ఎక్కడా కూడా లేకుండా చూడాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఎంపీవో అల్లూరి పద్మ, ఏపీవో జంగమ్మ, ఉపాధి హామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పంటలు ఎండుతున్నయ్



వరదకాల్వ ద్వారా నీటిని విడుదల చేయాలని రాస్తారోకో చేస్తున్న రైతులు(ఫైల్)

(5వ పేజీ తరువాయి)

నీరు అధికంగా ఉండడంతో ఎక్కువ మంది రైతులు బత్తాయి తోటలను తొలగించి వరి సాగు చేశారు. ప్రస్తుతం వరదకాల్వకు నీటి విడుదల నిలిపివేయడంతో సాగునీరు అందక వరి చేలు ఎండిపోతున్నాయి. ఏప్రిల్ 15వరకు నీటి విడుదల ఉంటుందని ఆశతో అప్పు చేసి సాగు చేసిన వరి ఎండిపోతుండటంతో పెట్టుబడులు కూడా వచ్చే అవకాశం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. నీటి విడుదల కొనసాగించాలని ఇటీవల మాడ్గులపల్లి మండల కేంద్రంలోని అద్దంకి-నార్కట్‌పల్లి రహదారిపై రైతులు ధర్నా నిర్వహించారు. నీటి విడుదల చేయకపోతే మండలంలోని వరదకాల్వ కింద సాగు చేసిన సుమారు 1,000 ఎకరాల్లో పంటలు ఎండిపోతాయని నారాయణపురం, మర్రిగూడెం గ్రామాల రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నీటి విడుదల చేయాలని కోరుతున్నారు.

ఏప్రిల్ 15వరకు నీటి విడుదల కొనసాగించాలి



వరదకాల్వకు ఏప్రిల్ 15వరకు నీటి విడుదల కొనసాగించాలి. నేను నాలుగు ఎకరాల్లో వరి సాగుచేశా. పది రోజులకుపైగా నీరు రాకపోవడంతో చేను ఎండిపోతోంది. వరదకాల్వకు నీరు రాకపోవడంతో భూగర్భజలాలు సైతం అడుగంటాయి. నీటి పారుదలశాఖ అధికారులు, ప్రభుత్వం స్పందించి ఏప్రిల్ 15వరకు వరదకాల్వ ద్వారా నీటిని విడుదల చేసి పంటలను కాపాడాలి.

● మైలవరపు కనకారెడ్డి, రైతు, కుక్కడం

పట్టించుకోరా.. ప్రాణాలు హరీ



ఒరిగిన ముఖద్వారం, ప్రహరీకి ఇరువైపులా పగుళ్లు

మునుగోడు మండలం పలివెల గ్రామంలోని వైకుంఠధామం ముఖద్వారం ప్రమాదకరంగా ఉంది. గ్రామంలో పల్లెపకృతి వనం, వైకుంఠధామం ఒకే చోట పక్క పక్కనే ఏర్పాటు చేశారు. నర్సరీ ఏర్పాటులో భాగంగా ఇతర ప్రాంతం నుంచి ఎర్ర మట్టి ట్రిప్పర్‌లో తరలిస్తుండగా అదుపు తప్పి ముఖద్వారం ఢీ కొనటంతో ధ్వంసమైంది. పక్కకు ఒరిగి నేలవాలుతూ ఉంది. ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. అక్కడి నుంచే కూలీలు రాకపోకలు సాగిస్తుంటారు. రెండేళ్లుగా ముఖ ద్వారం ప్రమాదకరంగా ఉన్నా ఎవరూ పట్టించుకో వడం లేదు. మండల అధికారులు సైతం తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శలున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రమాదం జరగకముందే చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

● (ఆంధ్రజ్యోతి), మునుగోడు.

కంచనపల్లిలో ప్రతిరోజూ నీటి సరఫరా

నల్లగొండ, మార్చి 26(ఆంధ్రజ్యోతి): కంచనపల్లిలో ప్రతిరోజూ నీరు సరఫరా చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఆంధ్రజ్యోతి మినీలో ఈ నెల 13న ప్రచురించిన 'నిధులులేక నిలిచిన పనులు' శీర్షికన ప్రచురించిన కథనానికి అధికార యంత్రాంగం వివరణ ఇచ్చింది. ఈ కథనంలో ప్రచురించిన ఫొటో ప్రకారం కంచనపల్లిలో నీటి సమస్యపై ఎంపీడీవో, ఎంపీవో, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, గ్రామపంచాయతీ కార్యదర్శి పరిశీలించారు. గ్రామంలో తాగునీటి సరఫరాకు 40కిలోలీటర్ల సామర్థ్యంగల మూడు ఓవర్‌హెడ్ ట్యాంకులు, ఆరు స్కీం బోర్లున్నాయని, ప్రతిరోజూ మిషన్‌భగీరథ, పీడబ్ల్యూఎస్ ద్వారా నీరు సరఫరా చేస్తున్నామన్నారు.

పంటలు ఎండిన రైతులను ఆదుకోవాలి

నల్లగొండ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): తీవ్ర కరువుతో పంటలు ఎండిపోతున్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు రేగట్టే మల్లికార్జున్ రెడ్డి డిమాండ్ చేశారు. జిల్లాకేంద్రంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. వర్షాభావ పరిస్థితులు, కరువుతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. యాసంగిలో భూగర్భజలాలు అడుగంటడడంతో పొలాలు ఎండిపోతున్నాయని పేర్కొన్నారు.

విజయయాత్రను జయప్రదం చేయాలి

రామగిరి, మార్చి 26(ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలో ఏప్రిల్ 12వ తేదీన నిర్వహించే వీర హనుమాన్ విజయయాత్రను జయప్రదం చేయాలని బజరంగ్‌దల్ జిల్లా కన్వీనర్లు నరసింహ, కోకల సందీప్ పిలుపునిచ్చారు. జిల్లాకేంద్రంలో బుధవారం కరపత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో వీహెచ్‌పీఎస్ పట్టణ అధ్యక్షుడు రాయిల కృష్ణయ్య, జూకూరి సంపత్ వర్మ, మామిడి సత్యనారాయణ, బల్లెం యాదగిరి, శ్రీనివాస్, ఉండ్యాల ప్రకాశ్‌రెడ్డి, రామలింగయ్య, శంకర్, ప్రభాకర్, రంగరాజు, సాత్విక్, శివ, అంబటి పృథ్వీరాజ్, క్రాంతి ఉన్నారు.

కేటీఆర్‌పై అక్రమ కేసులు సహించం




విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే లింగయ్య

నల్లగొండ టౌన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): 'ప్రభుత్వ వైఫల్యం ఎత్తి చూపితే కేసులు పెడతారా' అని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ప్రశ్నించారు. బీఆర్ఎస్ జిల్లా పార్టీ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తప్పులను కప్పి పుచ్చుకునేందుకు ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారని ఆరోపించారు. పదో తరగతి లీకేజీ కేసులో స్థానిక ఎమ్మెల్యే వీరేశం అనుచరులే ఉన్నారని, దాని వెనక ఎమ్మెల్యే హస్తముందని ఆరోపించారు. ఎమ్మెల్యే డ్రైవర్ ఉగ్గిడి శ్రీనివాస్ దీని వెనక అసలు సూత్రదారి అని, అతనిని ఆ కేసు నుంచి ఎమ్మెల్యే బెదిరింపులతో పోలీసులు తప్పించారన్నారు. నిందితులు స్కూల్ యాజమాన్యలతో భారీ మొత్తంలో ప్యాకేజీ మాట్లాడుకుని డైలీ పేపర్ లీకేజీ చేసేందుకు కుట్ర చేశారన్నారు. అమ్మాయిని బెదిరించి పేపర్ లీక్ చేయాలని ప్రయత్నం చేశారన్నారు. నకిరేకల్‌లో దాడులు, దౌర్జన్యాలు, ఆక్రమణలు చేసే నైజం వీరేషం మనుషులకే ఉందన్నారు. పేపర్ లీకేజీ వ్యవహారంలో కూడా ఇతరులకు ధైర్యం లేదన్నారు. విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు బోనగిరి దేవేందర్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

కేసులు పెట్టి వైఫల్యాల నుంచి తప్పించుకోలేరు

నల్లగొండ, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ప్రశ్న పత్రాల లీకేజీలో ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్‌పై అక్రమ కేసులు పెట్టారని, ఈ అక్రమ కేసులతో ప్రభుత్వం వైఫల్యాల నుంచి తప్పించుకోలేదని బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొమ్మరబోయిన నాగార్జున అన్నారు. బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పదో తరగతి పరీక్షలు మొదలైన ప్రారంభం రోజే నకిరేకల్‌లోని ప్రభుత్వ బాలికల గురుకుల పాఠశాలలో ప్రశ్నపత్రం లీకై సోషల్ మీడియాలో వైరల్ అయిందన్నారు. సమావేశంలో నోముల క్రాంతికుమార్, పాక రవి, సుదీర్, విజయ్, వేముల సాయి, రమేష్, ఉదయ్ ఉన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన నాయకులు



సీఎం రేవంత్‌రెడ్డితో ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి, నాయకులు

మునుగోడు, మార్చి 26(ఆంధ్రజ్యోతి): మునుగోడు మండలానికి చెందిన యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మేకల ప్రమోద్ రెడ్డి, జిల్లా మాజీ అధ్యక్షుడు పాల్వాయి జితేందర్‌రెడ్డి ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డితో కలిసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో బుధవారం కలిశారు. వెనుకబడిన తమ ప్రాంతంపై ప్రత్యేకంగా దృష్టి సారించి అధిక నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రికి విన్నవించారు. తాజాగా చేపట్టే మంత్రివర్గ విస్తరణలో తమ ప్రాంత ఎమ్మెల్యేకు మంత్రి పదవి ఇస్తుండటం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు.

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	:18004251442
యాదాద్రి	:1800 425 7106
సూర్యాపేట	:1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 60

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.120	180	200
సూర్యాపేట	రూ.105	170	200
నల్లగొండ	రూ.110	180	210

ఉష్ణోగ్రత గరిష్ఠం 36.0 । కనిష్ఠం 21.0

పంటలు ఎండుతున్నయ్

- పది రోజులుగా సాగర్ వరదకాల్వకు నిలిచిన నీటి సరఫరా
- ఇబ్బందులు పడుతున్న రైతులు
- నీటిని విడుదల చేయాలని వేడుకోలు



నారాయణపురంలో నీరందక ఎండిపోతున్న వరి చేను

సాగర్ ప్రాజెక్టు నుంచి వరదకాల్వకు పది రోజులుగా నీటి విడుదల నిలిచింది. సాగర్ జలాశయం 520 అడుగుల నీటిమట్టం ఉన్న సమయంలో జలాశయం నుంచి మోటార్ల ద్వారా వరదకాల్వకు నీటి విడుదల చేస్తారు. సాగర్ జలాశయంలో నీటి మట్టం పడిపోవడంతో నీటి విడుదలను ఈనెల 15న నిలిపివేశారు. దీంతో ఈ నీటి ఆధారంగా పంటలు సాగుచేసిన రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వరి కోతకు వచ్చే సమయంలో నీటి విడుదల నిలిచిపోవడంతో పొలాలు ఎండుముఖం పట్టాయి. - (ఆంధ్రజ్యోతి, మాడ్గులపల్లి)

నాగార్జునసాగర్ నుంచి లోలెవల్ వరద కాల్వ ద్వారా నీటిని అందించేందుకు ప్రభుత్వం ఈ కాల్వను తవ్వింది. వరదకాల్వ పెద్దవూర మండలం పుల్యాతండా వద్ద ప్రారంభమై పెద్దవూర, కనగల్, అనుముల, నిడమనూరు, త్రిపురారం, మాడ్గులపల్లి, వేములపల్లి మండలంలోని మొల్కపట్నం వరకు 85కి.మీ మేర విస్తరించి ఉంది. ఈ కాల్వ కింద సుమారు 50వేల ఎకరాల ఆయకట్టు స్థిరీకరించడంతోపాటు వరదకాల్వ ద్వారా చెరువులను నింపనున్నారు. సాగర్ జలాశయంలో నీరు పుష్కలంగా ఉండడంతో ఈ ఏడాది నీటి విడుదల నిరంతరంగా కొనసాగింది. మండలంలోని కన్నెకల్, నారాయణపురం, కేశవాపురం, దాచారం, చెరువుపల్లి, కుక్కడం, మాడ్గులపల్లి, మర్రిగూడెం, తోపుచర్ల, గండ్రవానిగూడెం, మొల్కపట్నం వరకు కాల్వపై ఆధారపడి రైతులు సుమారు 8వేల ఎకరాల్లో వరి సాగుచేశారు. సాగర్ జలాశయంలో..

మిగతా 8వ పేజీలో...

నాలుగు ఎకరాల పొలం ఎండుతోంది



వరదకాల్వ ఆధారంగా నాలుగు ఎకరాల్లో వరి సాగు చేశా. వరి ప్రస్తుతం పొట్ట దశలో ఉంది. వరదకాల్వ నీటి విడుదల నిలిచిపోవడంతో పంట చేతి కొస్తుందో రాదోనని ఆందోళనగా ఉంది. ఎకరాకు రూ.30వేలకు పైగా పెట్టుబడులు పెట్టా. సాగు నీటిని విడుదలచేసి పంటలను కాపాడాలి.

- దేవిరెడ్డి మల్లారెడ్డి, రైతు, మర్రిగూడెం



ఏది ప్రశ్నపత్రం లీకేజీకి.. రాజకీయ రంగు

పదో తరగతి తెలుగు-1 ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారానికి రాజకీయ రంగు పులుముకుంది. ప్రశ్నపత్రం లీకేజీకి కాంగ్రెస్ నాయకులకు సంబంధముందనే సందేశంతో సోషల్‌మీడియాలో దుష్ప్రచారం చేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఆ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ కొణతం దిలీప్, పార్టీ నేత మన్నె క్రిశాంక్, తెలుగు స్క్రైబ్ ఛానల్(వెబ్), టీన్యూస్, తెలుగు మిర్రర్ ఛానల్స్‌పై బుధవారం నకిరేకల్ పోలీస్‌స్టేషన్‌లో వేర్వేరుగా మూడు కేసులు నమోదయ్యాయి. అందులో ఒకటి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద నమోదవడం రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి,నల్లగొండ)



- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు
- నకిరేకల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన మాజీ సర్పంచ్ నరేందర్
- కేటీఆర్‌తో పాటు, కొణతం దిలీప్, మన్నె క్రిశాంక్‌పై మరో రెండు కేసులు
- తెలుగు స్క్రైబ్, టీన్యూస్ ఛానల్, తెలుగు మిర్రర్ ఛానళ్లపైనా నమోదు

సోషల్‌మీడియా పోస్టులు, రెండు పార్టీల నేతల పరస్పర ఖండనలు బుధవారం జిల్లా అంతా ఈ వ్యవహారంతో ఉడికిపోయింది. ఓ వైపు ఉదయం నుంచే నకిరేకల్ పోలీస్‌స్టేషన్‌లో మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత, మాజీ సర్పంచ్ నకిరేకంటి నరేందర్, మరో నేత ఉగ్గిడి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయగా, మరోవైపు అసెంబ్లీ లాబీల్లో మీడియాతో చిట్‌చాట్‌లో నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ఘాటుగా స్పందించారు. సోషల్ మీడియాలో కోతిరాముళ్ల గోకా, నాకా అన్నట్లు వ్యవహరిస్తున్నారని,తనని కెలకవద్దని హెచ్చరించారు.దళితులంటే వారికి ఈర్ష్య ఉందని,గతంలో వాళ్లకే లీకుల అలవాటుందని,పల్లీ,బఠానీలకు పేపర్లు విక్రయించుకున్న చరిత్ర వారిదేనని వ్యాఖ్యానించారు.చదువు విలువ తనకు తెలుసని,దమ్మంటే నేరుగా ఎదుర్కోవాలే తప్ప ఆకాశరామన్న ఉత్తరాలతో దుష్ప్రచారం చేయవద్దని హెచ్చరించారు.

సోషల్‌మీడియాలో ప్రచారం చేసినందుకు కేసులు

ఈనెల 21న పదో తరగతి తెలుగు-1 ప్రశ్నపత్రం ఫొటోలు లీకయ్యాయి. నకిరేకల్‌లోని ఎస్సీ గురుకుల పాఠశాలలోని పరీక్షా కేంద్రం నుంచి ఈ ఫొటో తీసినట్టు నిర్ధారించిన పోలీసులు ఈ కేసులో 12మందిని ఇప్పటికే రిమాండ్‌కు తరలించారు. మరొకరు పరారీలో ఉన్నారు. ఈ కేసు విచారణ సాగుతోందని పోలీసులు పేర్కొంటున్నారు. అయితే రెండు రోజుల క్రితం నుంచి ఈ లీక్ వ్యవహారంలో నిందితులైన గుడుకుంట్ల శంకర్, చింట్ల ఆకాశ్, బండి శ్రీనుకు నకిరేకల్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత, మాజీ సర్పంచ్ నరేందర్, మరో నాయకుడు ఉగ్గిడి శ్రీనివాస్‌కు సంబంధాలున్నాయని పేర్కొంటూ తెలుగుస్క్రైబ్ యూట్యూబ్‌ఛానల్ (వెబ్), టీన్యూస్, తెలుగు మిర్రర్ ఛానల్ తదితర సోషల్‌మీడియా వేదికల్లో ప్రసారమైంది. వాటిని నిర్ధారణ చేసుకోకుండా మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఆ పార్టీ సోషల్‌మీడియా విభాగం కన్వీనర్ కొణతం దిలీప్, మరో నాయకుడు మన్నె.

మిగతా 7వ పేజీలో...

కేసు దర్యాప్తునకు ఆటంకం కలుగుతుందనే ఆందోళన

అనూహ్యంగా ప్రశ్నపత్రం కేసుకు రాజకీయరంగు పులుముకోవడంతో దాని ప్రభావం విచారణపై పడే అవకాశముందని సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. ఇప్పటికే 13 మంది నిందితులను గుర్తించిన పోలీసులు వారిలో 12మందిని రిమాండ్‌కు తరలించారు. అయితే ప్రశ్నపత్రం లీక్ ఘటనలో మరింత లోతుగా విచారణ చేయాల్సిన అవసరం ఉంది. రాజకీయనేతల పరస్పర ఆరోపణలను పక్కనబెట్టి నిష్పక్షపాతంగా దర్యాప్తు సాగించాలనే డిమాండ్లు వస్తున్నాయి. పరీక్షా కేంద్రంలోకి నిందితులు వెళ్లడానికి ఎవరెవరు సహకరించారు? నకిరేకల్‌లో ఫొటో తీసిన ప్రశ్నపత్రం శాలిగౌరారంలో సోషల్‌మీడియా గ్రూపుల్లో ఎలా చక్కర్లు కొట్టింది? పేపర్ లీక్‌కు అసలు ప్రయత్నించారా? ప్రయత్నిస్తే వ్యక్తులుగా ఆ ప్రయత్నం చేశారా? లేక ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాల పాత్ర ఎంతవరకు ఉంది? నిందితుల్లో ఉన్న ఒక ప్రైవేట్ స్కూల్ నిర్వాహకుడితో పాటు, ఇంకా ఎవరైనా ఈ లీక్ కోసం పనిచేశారా? గట్టి నిఘా నిర్వహించాల్సిన పోలీస్ యంత్రాంగం ప్రశ్నపత్రం ఫొటో తీసేంతవరకు ఎందుకు అడ్డుకోలేకపోయింది? అనే పలు ప్రశ్నలకు పోలీసులు, విచారణాధికారులు నిగ్గుతేల్చాలనే డిమాండ్లు వస్తున్నాయి. తాజాగా, రాజకీయరంగు పులుముకోవడంతో విచారణ పక్కదారి పట్టకుండా చూడాలని, నిష్పక్షపాతంగా దర్యాప్తు కొనసాగించాలనే సూచనలు వస్తున్నాయి.



నకిరేకల్‌లో పాఠశాల వద్ద పోలీసుల బందోబస్తు

కాన్పుల సంఖ్య పెంచాలి

డీఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్



వెలిమినేడు పీహెచ్‌సీలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో శ్రీనివాస్

చిట్యాలరూరల్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాన్పుల సంఖ్య పెంచాలని జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ అన్నారు. మండలంలోని వెలిమినేడు పీహెచ్‌సీని బుధవారం తనిఖీ చేశారు. రికార్డులు, మందుల పంపిణీ, డ్రగ్స్ స్టోర్‌ను, ఇన్‌పేషెంట్ వార్డును, ల్యాబ్‌ను, ప్రసూతి గదిని పరిశీలించారు. వైద్యం కోసం ఆసుపత్రికి వచ్చిన వారి సేవలు ఎలా ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. గర్భిణుల నమోదును పెంచాలని సూచించారు. అనంతరం ఆసుపత్రి సిబ్బందితో సమావేశమయ్యారు. ప్రభుత్వాసుపత్రుల్లో అందుతున్న సేవల గురించి ప్రజలకు వివరించాలన్నారు. చిన్నారులకు సకాలంలో టీకలను ఇవ్వాలి, వైద్యులు, సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. నాణ్యమైన సేవలందించాలని సూచించారు. సేవలను వైద్యులు, సిబ్బంది వివరించాలన్నారు. సమావేశంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఉబ్బు నర్సింహ, డాక్టర్ లక్ష్మి, సీహెచ్‌వో చక్రవరి, సూపర్‌వైజర్లు శ్యామల, లక్ష్మి, ఫార్మాసిస్ట్, స్టాఫ్‌నర్స్ ప్రసన్నకుమారి, హేమ, త్రివేణి, పద్మావతి, మహేందర్, ఏఎన్ఎంలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాలి

ఓయూ జేఏసీ చైర్మన్ ఎనుగంటి రాజు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రాజు

నల్లగొండ టౌన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): బీసీల రిజర్వేషన్ల బిల్లుకు చట్టబద్ధత కల్పించే బాధ్యత కాంగ్రెస్ పార్టీదేనని ఓయూ జేఏసీ చైర్మన్ ఎనుగంటి రాజు నేత అన్నారు. ప్రభుత్వం వెంటనే జీవో విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక యాదవ సంఘం భవన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్‌లో బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం రిజర్వేసన్లు కల్పిస్తామని హామీ ఇచ్చిందన్నారు. ఈ మేరకు రిజర్వేషన్లకు వెంటనే చట్టబద్ధత కల్పించే బాధ్యత కాంగ్రెస్ పార్టీదేనని అన్నారు. బిల్లును పార్లమెంటుకు పంపి కేంద్ర ప్రభుత్వం మీద నెపం నెట్టివేయాలని రాష్ట్ర ప్రభుత్వం చూస్తోందన్నారు. వెంటనే రిజర్వేషన్లు పెంచే బిల్లుకు జీవో జారీచేసి గవర్నర్‌కు పంపాలన్నారు. 50 ఏళ్లుగా బీసీల కోసం పోరాడుతున్న ఆర్.కృష్ణయ్యను విమర్శించే పద్ధతి మార్చుకోవాలన్నారు. లేదంటే రానున్న రోజుల్లో తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. విలేకరుల సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు దుడుకు లక్ష్మీనారాయణ, జాతీయ ఉపాధ్యక్షుడు మిర్యాల యాదగిరి, నాయకులు మునాస ప్రసన్నకుమార్, గుండు వెంకటేశ్వర్లు, గడ్డె నాగరాజునేత, బెల్లి నాగరాజుయాదవ్, చల్ల కోటేష్‌యాదవ్, సట్టు యాదగిరి, సూర ముత్యాలు, దేవులపల్లి నరసింహ, హరిబాబు, లింగయ్యయాదవ్, జానయ్య, పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది బాధ్యతగా పనిచేయాలి

కలెక్టర్ ఇలా త్రిపాఠి



చింతపల్లి కస్తూర్బాలో విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

చింతపల్లి, మార్చి 26(ఆంధ్రజ్యోతి): వైద్య సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. మంగళవారం పీహెచ్‌సీలో ఓ మహిళకు వైద్య ఆరోగ్య సిబ్బంది సాధారణ ప్రసవం చేశారని తెలియడంతో కలెక్టర్ పీహెచ్‌సీని సందర్శించి సిబ్బందిని అభినందించారు. పీహెచ్‌సీకి వచ్చిన 84 మందితో కలెక్టర్ మాట్లాడి వైద్య సేవలపై అడిగి తెలుసుకున్నారు. మహిళలు ఆరోగ్యంగా ఉండాలంటే పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. అనంతరం మండలంలోని హరిజనాపురం, కుర్మపల్లి, కుర్మేడ్ గ్రామాల్లో కలెక్టర్ పర్యటించారు. వేసవి కావడంతో తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్థులు పలువురు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, తాగునీటి ఎద్దడి నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో, ఏఈని ఆదేశించారు. అంతకుముందు మండల కేంద్రంలోని కేజీబీవీని తనిఖీచేసి విద్యార్థినులతో ఆమె మాట్లాడారు. ఆమె వెంట ఆర్డీవో రమణారెడ్డి, తహసీల్దార్ రమాకాంత్‌శర్మ, ఎంపీడీవో సుజాత, మండల క్లస్టర్ వైద్యాధికారి శ్రీదేవి, ఇక్బాల్, తదితరులు ఉన్నారు.

'పది' కేంద్రాల వద్ద సౌకర్యాలు కల్పించాలి

(ఆంధ్రజ్యోతి, కొండమల్లేపల్లి): పదోతరగతి పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. బుధవారం కొండమల్లేపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో పదోతరగతి పరీక్షా కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద భద్రత, హాజరైన విద్యార్థుల వివరాలు, తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ప్రథమ చికిత్స ఏర్పాట్ల వివరాలను చీఫ్ సూపరింటెండెంట్‌ను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట దేవరకొండ ఏఎస్పీ మౌనిక, ఆర్డీవో రమణారెడ్డి, కొండమల్లేపల్లి ఎస్ఐ రాంమూర్తి, తదితరులు ఉన్నారు.

ఎంపీడీవో కార్యాలయానికి విద్యుత్ నిలిపివేత

- రూ.1.50లక్షలు బిల్లు బకాయి
- సాయంత్రానికి పునరుద్ధరణ



చిట్యాల ఎంపీడీవో కార్యాలయం

చిట్యాలరూరల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ బిల్లు బకాయి ఉండడంతో చిట్యాల ఎంపీడీవో కార్యాలయానికి విద్యుత్ అధికారులు సరఫరా నిలిపివేశారు. సుమారు రెండేళ్లుగా విద్యుత్ బకాయిలు చెల్లించడం లేదు. మూడు రోజుల క్రితం బకాయి బిల్లు అందజేసినట్లుగా తెలిసింది. సుమారు రూ.1.50లక్షలు బకాయి ఉంది. బుధవారం కార్యాలయం తెరచిన కాసేపటికే విద్యుత్ సిబ్బంది కార్యాలయంలో ఫ్యూజ్ తొలగించారు. ఈ విషయాన్ని అధికారులు ఎంపీడీవో జయలక్ష్మి దృష్టికి తీసుకెళ్లారు. విద్యుత్‌ను ఉదయం నుంచి సాయంత్రం నాలుగున్నర వరకు సరఫరాను నిలిపివేశారు. బకాయి పడిన బిల్లును చెల్లిస్తామని అధికారులు విద్యుత్ అధికారులకు సమాచారం ఇచ్చారు. తొలగించిన ఫ్యూజ్‌లను మీటర్ సమీపంలోనే పెట్టి వెళ్లగా తిరిగి నాలుగున్నర సమయంలో వచ్చి అక్కడే పెట్టిన ఫ్యూజ్ కలిపి వెళ్లారు. ఈ విషయంపై ఎంపీడీవో ఎస్‌పీ జయలక్ష్మిని సంప్రదించగా విద్యుత్ బిల్లు బకాయి ఉందని,తగినంతగా ఫండ్ లేనందున చెల్లించడం ఆలస్యమైందని తెలిపారు. విద్యుత్ బిల్లు బకాయిల విషయాన్ని జడ్పీ సీఈవో దృష్టికి తీసుకెళ్లామని ఫండ్ లేనందున చెల్లించలేకపోతున్నామని చెప్పి బిల్లును జడ్పీకి పంపిస్తున్నామని తెలపగా ఆయన సరేనన్నారని, అందుకు బకాయి బిల్లును జడ్పీకి పంపించామని తెలిపారు.

కళాశాలల బకాయిలు వెంటనే చెల్లించాలి



ఆర్డీవో అశోక్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న మారం నాగేందర్‌రెడ్డి, తదితరులు

నల్లగొండ క్రైం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని డిగ్రీ కళాశాలలకు నాలుగేళ్లుగా పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిగ్రీ అండ్ పీజీ కళాశాలల యాజమాన్యాల అసోసియేషన్ అధ్యక్షుడు మారం నాగేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్డీవో అశోక్‌రెడ్డికి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. విద్యార్థుల కోసం ప్రభుత్వం చెల్లించే ఫీజుల ద్వారా మాత్రమే నడుస్తున్న డిగ్రీ కళాశాలలకు నాలుగేళ్లుగా ఆర్‌టీఎఫ్, ఎంటీఎఫ్ బకాయిలు చెల్లించడం లేదన్నారు. దీంతో పేద విద్యార్థులతోపాటు కళాశాలల యాజమాన్యాలు ఇబ్బందులకు గురవుతున్నాయన్నారు. ప్రభుత్వం ఎంటీఎఫ్ చెల్లించకపోవడంతో పేద విద్యార్థులు పరీక్ష ఫీజులను సైతం చెల్లించలేక మధ్యలోనే విద్యకు దూరమవుతున్నారని అన్నారు. ఆర్థిక భారం, అప్పుల బాధతో కళాశాలలు నిర్వహించలేని పరిస్థితి ఉందని, వెంటనే బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు పి.నర్సింహారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సత్యం, గుండగోని జానయ్యయాదవ్, జైపాల్‌రెడ్డి, సైదారావు, నగేష్, చుక్కా సైదులు, తదితరులు పాల్గొన్నారు.

సీఎస్, డీవోలపై చర్యలకు సిఫార్సు

- ఇంటర్ ప్రశ్నపత్రాల ప్యాకింగ్ విషయంలో నిర్లక్ష్యం
- ఇంక్రిమెంట్ నిలిపివేయడం లేదా జరిమానా విధించాలని సూచన
- కలెక్టర్‌కు నివేదిక ఇచ్చిన మిర్యాలగూడ సబ్‌కలెక్టర్
- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

నల్లగొండ, మార్చి 26 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): ఇంటర్ ప్రశ్నపత్రాలను పరీక్షా కేంద్రానికి తీసుకురావడంలో నిర్లక్ష్యం వహించిన సీఎస్, డీవోలపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠికి మిర్యాలగూడ సబ్‌కలెక్టర్ అమిత్ నారాయణ్ నివేదించారు. 'ఇంటర్ ప్రశ్నపత్రాల ప్యాకింగ్‌లో నిర్లక్ష్యం' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ఈనెల 15న ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించి విచారణనిర్వహించారు. 12వ తేదీ ప్రశ్నపత్రాల బండిల్స్‌తో పాటు, 13వ తేదీకి సంబంధించిన ఒకేషనల్ ప్రశ్నపత్రాల బండిల్స్ వచ్చిన విషయాన్ని విచారణలో నిర్ధారించి, దీనికి బాధ్యులైన హాలియా జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ జాకిర్ హుస్సేన్, డిపార్ట్‌మెంటల్ అధికారి వెంకటేశ్వర్లుకు ఒక ఇంక్రిమెంట్ నిలిపివేయడం లేదా, జరిమానా విధించడం గానీ చేయాలని కలెక్టర్‌కు మిర్యాలగూడ సబ్‌కలెక్టర్ అమిత్ నారాయణ్ నివేదిక ఇచ్చారు. ప్రశ్నపత్రం విషయంలో 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనంపై కలెక్టర్ స్పందించి విచారణ నిర్వహించాలని మిర్యాలగూడ సబ్‌కలెక్టర్ అమిత్‌నారాయణ్‌ను ఆదేశించారు. ఆయన ఆదేశాల మేరకు అనుముల తహసీల్దార్ విచారణ నిర్వహించారు. హాలియా ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రంలో 12వ తేదీన వచ్చిన ప్రశ్నపత్రాల బండిల్స్‌తో పాటు, 13వ తేదీకి సంబంధించిన ఒకేషనల్ ప్రశ్నపత్రాల బండిల్స్ కలిసి వచ్చాయి. అయితే ఈ బండిల్స్ కలిసిన విషయాన్ని వెంటనే గుర్తించి, వాటిని తెరవకుండా తిరిగి పోలీస్‌కస్టడీకి తరలించారు. దీంతో ప్రశ్నపత్రం లీక్ వంటి ప్రమాదం జరగలేదు. అయితే ఈ ఘటనకు చీఫ్ సూపరింటెండెంట్ జాకిర్ హుస్సేన్, డిపార్ట్‌మెంటల్ అధికారి వెంకటేశ్వర్లు బాధ్యులుగా గుర్తించామని, వారి తప్పిదంగానే పరిగణించి చర్యలు తీసుకోవాలని సూచిస్తూ కలెక్టర్‌కు సబ్‌కలెక్టర్ నివేదిక సమర్పించారు.

గోదాముల నిర్మాణానికి సబ్సిడీలు ఇవ్వాలి

డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి



చెన్నైలో ఎఫ్‌సీఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌తో శ్రీనివాస్‌రెడ్డి

నల్లగొండ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోళ్ల అనంతరం నిల్వల కోసం గోదాముల నిర్మాణానికి సబ్సిడీ ఇవ్వాలని ఉమ్మడి నల్లగొండ జిల్లా డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి కోరారు. బుధవారం తమిళనాడు రాష్ట్రంలోని చెన్నైలో సౌత్ ఇండియా ఎఫ్‌సీఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జజింత లాజరస్‌తో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పీఏసీఎస్‌ల ద్వారా ధాన్యం సేకరించి గోదాముల్లో నిల్వ ఉంచితే గిట్టుబాటు ధర లభించినప్పుడు రైతులు విక్రయించి లాభాలు ఆర్జించడానికి వీలుగా ఉంటుందన్నారు. అదేవిధంగా రైతులు దళారుల బారిన పడకుండా ఉంటుందన్నారు. అందుకు సహకరించాలని కోరారు.

నేడు పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేత


దామరచర్ల, మార్చి 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని తాళ్లవీరప్పగూడెం సబ్‌స్టేషన్‌లో పనులు జరుగుతున్నందున నేడు సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు. మండలంలోని తాళ్లవీరప్పగూడెం, ఇర్కిగూడెం, నర్సాపురం ఫీడర్ల కింద ఉన్న గ్రామాలకు ఉదయం 6గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏఈ అబ్దుల్లా హబీబ్ బుధవారం తెలిపారు. వినియోగదారులు సహకరించాలన్నారు.

ఆలయాల హుండీ లెక్కింపు

దామరచర్ల, మార్చి 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని వాడపల్లిలో కొలువైన శ్రీమీనాక్షి అగస్త్యేశ్వరస్వామి దేవాలయం, శ్రీలక్ష్మీనరసింహాస్వామి దేవాలయంలో మూడు నెలల్లో సమకూరిన హుండీ ఆదాయాన్ని బుధవారం మిర్యాలగూడ ఇన్‌స్పెక్టర్ ఏడుకొండలు పర్యవేక్షణలో లెక్కించారు. శ్రీమీనాక్షి అగస్త్యేశ్వరస్వామి ఆలయ హుండీ ద్వారా రూ.2,31,235 ఆదాయం రాగా, లక్ష్మీనరసింహస్వామి ఆలయం హుండీ ద్వారా రూ.1,07,869 ఆదాయం వచ్చినట్లు ఈవో బి.జ్యోతి తెలిపారు. కార్యక్రమంలో అనువంశిక ధర్మకర్త కొండూటి సిద్ధయ్య పాల్గొన్నారు.

దుమ్ములేస్తోంది

● రోడ్డు మరమ్మతు పనుల్లో కాంట్రాక్టర్ నిర్లక్ష్యం
● కంకర వేసి నీళ్లు వదిలేసిన వైనం
● దుమ్ములేసి ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోని అధికారులు


బస్సు వచ్చే సమయంలో దుమ్ము లేస్తున్న వైనం

గుర్రంపోడు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): రోడ్డు మరమ్మతు పనుల్లో కాంట్రాక్టర్ నిర్లక్ష్యం మూలాన ఇటు ప్రయాణికులు, అటు వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. వివరాల్లోకి వెళితే.. జిల్లా కేంద్రం నుంచి కొండమల్లేపల్లి వరకు కొంతకాలంగా రోడ్డు మరమ్మతు పనులు చేపడుతున్నారు. రహదారి పూర్తిగా ధ్వంసమైన చోట అక్కడ రోడ్డును తవ్వి కొత్తగా కంకర, డస్ట్ వేసి చదును చేస్తున్నారు. ఇదంతా బాగానే ఉన్నప్పటికీ దుమ్ము రాకుండా ఉదయం సాయంత్రం నీళ్ల కొట్టి చదును చేయాల్సి ఉన్న కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో నీళ్ల కొట్టకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గుర్రంపోడు, కొప్పోలు సమీపంలో పెద్ద వాహనాలు వెళ్లే సమయంలో వస్తున్న దుమ్ముకు ఎదుటి వాహనాలు కనిపించచడంలేదని వాపోతున్నారు. అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో కనీసం సూచిక బోర్డులు ఏర్పాటు చేయకుండా కాంట్రాక్టర్ ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారని విమర్శిస్తున్నారు. నత్తనడకన పనులు చేయిస్తున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి



రోడ్డు మరమ్మతు పనులు జరిగే చోట సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి. పెద్ద వాహనాలు వెళ్లే సమయంలో బైకుపై వెళ్తుంటే ఆ దుమ్ముకి ఏమీ కన్పించడంలేదు. ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పనుల్లో నాణ్యతాలోపం కూడా ఉంది. అధికారులు స్పందించి సూచిక బోర్డులు ఏర్పాటు చేయించి, రోజూ నీటితో చదును చేసి ప్రమాదాలు జరగకుండా చూడాలి.

యాగంటి నారాయణ, గుర్రంపోడు

ఆర్‌అండ్‌బీ స్థలం కబ్జా


ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేసుకున్న డబ్బాకొట్లు

● మొదట తాత్కాలికంగా డబ్బాల ఏర్పాటు
● అనంతరం శాశ్వత నిర్మాణాలు
● పట్టించుకోని ఆర్‌అండ్‌బీ అధికారులు

గుర్రంపోడు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : గుర్రంపోడు మండలకేంద్రంలోని మెయిన్ సెంటర్‌లో ఆర్ అండ్‌బీ గెస్టహౌస్ ఎదురుగా రూ.కోట్ల విలువైన స్థలం కబ్జాకు గురవుతుంది. గత 30 సంవత్సరాల నుంచి ఆర్‌అండ్‌బీ గెస్టహౌస్ ఎదురుగా చిరువ్యాపారాలు చేసుకునేందుకు తాత్కాలికంగా డబ్బాలను ఏర్పాటు చేసుకున్నారు. క్రమక్రమంగా ఆర్‌అండ్‌బీ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోతుండడంతో శాశ్వత నిర్మాణాలు చేపట్టి వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. ప్రధాన రహదారి వరకు కబ్జా చేస్తున్నప్పటికీ అధికారులు ఎవరూ కన్నెత్తి చూడకపోతుండడంతో రోజురోజుకు నిర్మాణాలు పెరిగిపోతున్నాయి. దీంతోపాటు నిర్మాణాలు చేసి సుమారు రూ.5వేల నుంచి రూ.10వేల వరకు అద్దెలు కూడా వసూలు చేసుకుంటున్నారు. కొందరు ఆక్రమణదారులు వారి పేరిట గ్రామ పంచాయతీ రికార్డుల్లో నమోదు చేయించుకొని రిజిస్ట్రేషన్లు చేసుకొని క్రయ, విక్రయాలు కూడా జరుపుకున్నారు. ఇంత జరుగుతున్నా ఆర్‌అండ్‌బీ అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడడం లేదు. రూ.కోట్ల ఆర్‌అండ్‌బీ స్థలం కబ్జాకు గురికాకుండా అక్రమాలను నిలిపివేయాలని స్థానికులు కోరుతున్నారు.

30 ఏళ్లుగా ఆక్రమణలు జరుగుతున్నాయి : అనిత, ఆర్‌అండ్‌బీ ఏఈ

ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్ ఎదురుగా ఆక్రమణలపై ఏఈ అనితను వివరణ కోరగా.. ప్రధాన రహదారి మధ్య నుంచి 40 ఫీట్ల వరకు ఆర్‌అండ్‌బీ స్థలం ఉంటుందని తెలిపారు. ఆక్రమణదారులు గత 30 ఏళ్ల నుంచి తిష్ట వేశారని, ప్రస్తుతం తానేమీ చేయలేనని వివరణ ఇచ్చారు.

సమాజ సేవకుడు

నిరుపేద కుటుంబంలో పుట్టినా తనవంతు సమాజానికి ఏదో చేయాలనే తపనతో ముందుకు సాగుతున్నాడు ఈ యువకుడు. తాను చేసేది చిన్న ఉద్యోగం అయిన, సమాజానికి ఎంతలో కొంత ఇవ్వాలని ఆయన లక్ష్య. 12 ఏళ్లుగా సమాజానికి సేవచేస్తూ అందుకు గుర్తింపుగా జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో పలు అవార్డులు అందుకున్నారు.
(ఆంధ్రజ్యోతి-నాగార్జునసాగర్)


పేదలకు సామగ్రి అందజేస్తున్న సాధిక్, ఇన్‌సెట్‌లో సాధిక్

పెద్దవూర మండల కేంద్రానికి చెందిన మహ్మద్ సాదిక్ పాష డిప్లోమా పూర్తి చేసి ఆర్టీసీలో టెక్నీషియన్‌గా(మోకానిక్) పనిచేస్తున్నారు. వృత్తి ఆర్టీసీ టెక్నీషియన్ అయినప్పటికీ సమాజ సేవ ప్రవృత్తిగా ఎంచుకున్నారు.

అనాథ, వృద్ధాశ్రమాలు, మానవ హక్కుల పరిరక్షణకు..

అనాథ, వృద్ధాశ్రమాలు, మానవ హక్కుల పరిరక్షణ, వినియోగదారుల హక్కుల రక్షణ, ప్రజారోగ్య పరిరక్షణ కోసం అవగాహన సదస్సులు నిర్వహిస్తుంటారు. సమాజంలో నిరాధరణకు గురైన వారిని, తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారులను, మలి దశలో తల్లిదండ్రులను వృద్ధాశ్రమాల్లో వదిలేస్తున్న వారికి వయో వృద్ధుల చట్టంపై అవగాహన కల్పిస్తూ ఎందరో తల్లిదండ్రులను తమ పిల్లల వద్దకు చేర్పించారు. అపదలో ఉండి రక్తం అవసరమున్న వారికి వెంటనే రక్తన్ని సమకూర్చడం వంటి కార్యక్రమాలను సాదిక్ చేస్తున్నారు. కరోనా సమయంలో చనిపోయిన అనాథ శవాలకు స్వయంగా అంతిమ సంస్కరాలు చేశారు.

విద్యార్థులు నైపుణ్యాలు పెంచుకోవాలి

అమెరికా ఇంజనీర్లు క్రిస్, దరోట


పదో తరగతి విద్యార్థులతో అమెరికా ఇంజనీర్లు క్రిస్, దరోట

హాలియా, మార్చి26 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు నైపుణ్యాలు పెంచుకుంటే ప్రపంచంలో ఎక్కడైనా రాణించవచ్చని అమెరికా ఇంజనీర్లు క్రిస్, దరోట అన్నారు. బుధవారం శ్రీశైలం పుణ్యక్షేత్రం దర్శించుకొని తిరుగు ప్రయాణంలో హాలియా మునిసిపాలిటీలోని ఉన్నత పాఠశాలను సందర్శించి పదో తరగతి విద్యార్థులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే భాషపై పట్టు ఉంటే, కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందుతాయన్నారు. ప్రపంచంలోని వివిధ దేశాలలో తమకు సాఫ్ట్‌వేర్ కంపెనీలు ఉన్నాయని, నైపుణ్యం కలిగిన విద్యార్థులకు అవకాశాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ మేడేపల్లి మోహన్‌రావు, ప్రధానోపాధ్యాయులు మోదాల రవీందర్, ఎస్.గోపినాయర్, మహ్మద్ కరీం,తదితరులు పాల్గొన్నారు.

దేవాలయాలు సంస్కార నిలయాలు

తిరుమలగిరి(సాగర్), మార్చి 26(ఆంధ్రజ్యోతి): దేవాలయాలు సంస్కార నిలయాలని హనుమాన్ శక్తి జాగరణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాయప్రోలు మురళీ గురుస్వామి అన్నారు. బుధవారం మండలంలోని ఎల్లాపురం, కొంపల్లి గ్రామాల్లో ధర్మ రక్షా ఫౌండేషన్ ప్రెసిడెంట్ అనుముల నవీన్‌కుమార్ అధ్వర్యంలో దేవాలయాలకు దూప, ధీప, నైవేద్య కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా వారు హాజరై పూజా సామగ్రిని పంపిణీ చేసి మాట్లాడారు. దేవాలయాల సంరక్షణ బాధ్యత హిందూ సమాజంపై ఉందన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ గౌరవ సలహాదారులు కొమ్ము రామదాసు, కార్యదర్శులు గుండాల లక్ష్మయ్య, తంగరాజు గణేష్, బీజేపీ మండల మాజీ అధ్యక్షుడు కోట్ల నరసింహారెడ్డి, మండల నాయకులు శాగం శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

బకాయిలను విడుదల చేయాలి


డీఏవో శర్మకు వినతిపత్రం అందజేస్తున్న కళాశాలల యజమానులు

మిర్యాలగూడ, మిర్యాలగూడ టౌన్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని డిగ్రీ కళాశాలల యాజమాన్యాలకు నాలుగు సంవత్సరాల ఆర్టీఎఫ్, ఎంటీఎఫ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని మహాత్మాగాంధీ యూనివర్సిటీ తెలంగాణ అఫిలియేటెడ్ డిగ్రీ, పీజీ కళాశాల మేనెజ్‌మెంట్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ ఎం. వెంకట్‌రెడ్డి కోరారు. ఈ మేరకు సబ్‌కలెక్టర్ కార్యాలయంలో డీఏవో శర్మకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల పక్షాన ప్రభుత్వం చెల్లించే ఫీజుల ద్వారా కొనసాగుతున్న డిగ్రీ కళాశాలలకు గత నాలుగేళ్లుగా ఆర్టీఎఫ్, ఎంటీఎఫ్‌లు చెల్లించకపోవడంవల్ల అనేక మంది పేద విద్యార్థులు, యాజమాన్యాలు ఇబ్బందులకు గురవుతున్నాయన్నారు. అప్పులు తెచ్చి కళాశాలల బోధన, బోధనేతర సిబ్బందికి జీతాలు చెల్లిస్తూ విద్యార్థులకు ఉత్తమ విద్య అందిస్తున్నామన్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరం పూర్తి కావొస్తున్నా, బకాయిలు చెల్లించకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామన్నారు. కళాశాలల భవనాల అద్దె, ఉద్యోగుల జీతాల చెల్లింపులు, రోజువారి కార్యక్రమాలకు ఖర్చులకు కూడా వెతుక్కునే పరిస్థితి ఏర్పడిందన్నారు. కార్యక్రమంలో కళాశాలల యజమానులు టి.ధనుంజయ, కె.శ్రీనివాస్, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రివర్గంలో అవకాశం కల్పించాలి

దేవరకొండ, మార్చి 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రివర్గంలో లంబాడీలకు అవకాశం కల్పించాలని యువజన కాంగ్రెస్ నల్లగొండ జిల్లా ఉపాధ్యక్షుడు కొర్ర రాంసింగ్ కోరారు. బుధవారం న్యూఢిల్లీలో కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌ను కలిసి వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు. మంత్రి పదవి ఇస్తే అభివృద్ధి చెందుతుందని ఆమె దృష్టికి తీసుకెళ్లినట్లు రాంసింగ్‌నాయక్ తెలిపారు.

ఎమ్మెల్యే బాలునాయక్‌కు మంత్రి పదవి ఇవ్వాలి

దేవరకొండ: దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్‌కు మంత్రి పదవి ఇవ్వాలని దేవరకొండలో కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ విగ్రహనికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ఎస్సీ సెల్ మండల ఉపాధ్యక్షుడు అంకూరి శివ మాట్లాడుతూ దేవరకొండ అభివృద్ధికి మంత్రి పదవి ఇవ్వాలన్నారు.

ఆర్టీసీ ద్వారా రాములోరి తలంబ్రాలు

● రూ.151 చెల్లించి అందుకోండి ● డిపో మేనేజర్ రాంమోహన్‌రెడ్డి

మిర్యాలగూడ టౌన్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ సంస్థ ద్వారా ప్రయాణికులకు రాములోరి తలంబ్రాలు అందించనున్నట్లు డిపో మేనేజర్ రాంమోహన్‌రెడ్డి తెలిపారు. బుధవారం డిపో ప్రాంగణంలో మాట్లాడుతూ ఆర్టీసీ లాజిస్టిక్స్ ద్వారా భక్తులకు రూ.151కే తలంబ్రాలు అందిస్తున్నట్లు తెలిపారు. శ్రీరామనవమి సందర్భంగా భద్రాద్రి ఆలయంలో సీతారాముల కల్యాణమహోత్సవ తలంబ్రాలను భక్తులకు కార్గో ద్వారా అందించనున్నట్లు తెలిపారు. అనంతరం పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు భారతీభాయి, యాదగిరి, కార్మిక సంఘం నాయకులు జీ. శ్రీనివాస్, జానకిరాంరెడ్డి, ఎస్.నారాయణ తదితరులు పాల్గొన్నారు.


రాములోరి కల్యాణం తలంబ్రాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డీఎం రాంమోహన్‌రెడ్డి

పరీక్షా కేంద్రాలను పరిశీలించిన డీఈవో

మిర్యాలగూడ టౌన్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షా కేంద్రాలను డీఈవో బొల్లారం భిక్షపతి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షలు జిల్లావ్యాప్తంగా ప్రశాంతంగా జరుగుతున్నాయన్నారు. విద్యార్థులు ఎలాంటి ఆందోళనలకు గురి కాకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఎంఈవో లావూరి బాలు పాల్గొన్నారు.

రుగ్వేద పండితులను తయారు చేయడమే లక్ష్యం

పెద్దఅడిశర్లపల్లి, మార్చి 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రుగ్వేద పండితులను తయారు చేయడమే లక్ష్యమని రాఘవేంద్రశర్మ అన్నారు. బుధవారం మండలంలోని అజ్మపురం గ్రామంలో నియోజకవర్గ బ్రాహ్మణ సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాఘవేంద్రశర్మ మాట్లాడుతూ పిల్లలను ఇవ్వండి.. పాఠశాలలు ఏర్పాటు చేసి రుగ్వేద పండితులను తయారు చేస్తానన్నారు. కార్యక్రమంలో రవిప్రసాద్, సురభి కృష్ణమూర్తి, వంశీకృష్ణశర్మ, శ్రీనివాస్ శర్మ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం


కొండమల్లేపల్లిలో సీసీ పనులు ప్రారంభిస్తున్న వేమన్‌రెడ్డి

హాలియా, మార్చి 25(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని కాంగ్రెస్ అనుముల మండల అధ్యక్షుడు కుందూరు వెంకట్‌రెడ్డి అన్నారు. బుధవారం అనుముల మండలం పేరూరు గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధుల నుంచి మంజూరైన రూ.5లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తూనే గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకోసం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎస్.కె. గౌస్‌బాబా, శ్రీ స్వయంభూ సోమేశ్వరస్వామి దేవాలయ చైర్మన్ రిక్కల కొండారెడ్డి, నకిరేకంటి సైదులు, జానపాటి రామలింగయ్యయాదవ్, జానీబాబా, జానీపాషా, రవీందర్ పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి: కొండమల్లేపల్లి మేజర్ గ్రామపంచాయతీ అభివృద్ధికి ప్రభుత్వం నిధులు కెటాయించి అభివృద్ధి చేస్తుందని కొండమల్లేపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఉట్కూరి వేమన్‌రెడ్డి, నల్లగొండ కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ కోఆర్డీనేటర్ ఎం.ఎ.సిరాజ్‌ఖాన్‌లు అన్నారు. బుధవారం కొండమల్లేపల్లిలో సీసీరోడ్ల పనులను ప్రారంభించి మాట్లాడారు. నాణ్యత ప్రమాణాలతో రోడ్ల నిర్మాణం వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. వారి వెంట కాంగ్రెస్ నేతలు, అధికారులు ఉన్నారు.

పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలి


దేవరకొండ ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నేతలు

దేవరకొండ, మార్చి 26(ఆంధ్రజ్యోతి): పేదలందరికీ ఇంటి స్థలాలు, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులను పంపిణీ చేయాలని సీపీఎం దేవరకొండ మండల కార్యదర్శి నల్ల వెంకటయ్య డిమాండ్ చేశారు. బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో దేవరకొండ ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి మాట్లాడారు. సీపీఎం ఆధ్వర్యంలో ప్రజాపోరు కార్యక్రమంలో భాగంగా ప్రజా సమస్యలను తెలుసుకొని పరిష్కరించేలా ఉద్యమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రజా సమస్యలపై సీపీఎం పోరాడుతుందన్నారు. అనంతరం ఆర్డీవో కార్యాలయ అధికారికి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో సీపీఎం మండల కార్యవర్గ సభ్యులు యాదగిరి, బిజిలి లింగయ్య, జ్యోతి, బుడిగె వెంకటేష్, ఎగ్‌బాల్, నర్సింహ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి: ప్రజాసమస్యల పరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నారి ఐలయ్య ఆరోపించారు. కొండమల్లేపల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి తహసీల్దార్ అన్వర్ హుస్సేన్‌కు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కంబాలపల్లి ఆనంద్, లక్ష్మణ్‌నాయక్, శ్రీనివాస్, కృష్ణయ్య, సత్యనారాయణ పాల్గొన్నారు.

మాడ్గులపల్లి: మండలంలోని అన్ని గ్రామాల్లో నెలకొన్న ప్రజా సమస్యలను పరిష్కరించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి అన్నారు.మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టి అనంతరం కార్యాలయంలో వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి రొండి శ్రీనివాస్, దేవిరెడ్డి అశోక్‌రెడ్డి, పాదూరి గోవర్ధని, పుల్లెంల శ్రీకర్, శ్రీను, అంజయ్య పాల్గొన్నారు.

వడ్డీ రాయితీని సద్వినియోగం చేసుకోవాలి

● కమిషనర్ మహ్మద్ యూసుఫ్

మిర్యాలగూడ టౌన్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ఆస్తి పన్ను వడ్డీ రాయితీని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మునిసిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్ అన్నారు. ఆస్తి పన్ను బకాయిల అపరాధ రుసుముపై 90శాతం వడ్డీ రాయితీని ప్రభుత్వం ప్రకటించడం హర్షనీయమన్నారు. పట్టణ పరిధిలో రూ.7.66కోట్ల బకాయిలు(ఏరియర్స్) ఉండగా, అపరాధ రుసుం రూ.8.08కోట్లుగా ఉందన్నారు. ఈ నెల 31వ తేదీ వరకు ప్రభుత్వం కల్పించిన వడ్డీ రాయితీని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇటీవల కాలంలో వడ్డీసహా ఆస్తిపన్ను చెల్లించిన యజమానులకు భవిష్యత్ పన్నులో రాయితీని మినహాయింపు ఇస్తామన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారి జ్ఞానేశ్వరి, సంబయ్య, రామలింగం, షాజి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం అందజేత

తిరుమలగిరి(సాగర్), మార్చి 26(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన ఇరిగి శ్రీను ఇటీవల మృతిచెందగా వారి కుటుంబానికి కాంగ్రెస్‌నేత, సామాజిక కార్యకర్త పగడాల సైదులు ఆర్థికసహాయం అందజేశారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన మృతుడి నివాసానికి వెళ్లి కుటుంబసభ్యులను ఓదార్చి, అతని భార్య పీరమ్మకు రూ.10వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఆయనవెంట ఇరిగి శ్రీను, ఇరిగి సైదయ్య, ఇరిగి నాగయ్య, అనుముల అంజయ్య, ఇరిగి వెంకటయ్య, శ్రీను, వంగూరు పురుషోత్తం, అంజయ్య, లక్ష్మయ్య పాల్గొన్నారు.

డిండి: అనారోగ్యంతో మంగళవారం మృతి చెందిన డిండి మండల కేంద్రానికి చెందిన చింతకుంట్ల మరియమ్మ కుటుంబానికి డిండి యువత చేయూత సభ్యులు బుధవారం రూ.10వేల ఆర్థిక సహాయాన్ని మృతురాలి సోదరి ప్రమీలకు అందజేశారు. కార్యక్రమంలో బొల్లె సైలేజ్, బాదమోని శ్రీనివాస్‌గౌడ్, ఏటి కృష్ణ, మునగపాటి శ్రీను, పున్న దినేష్, ప్రేమయ్య పాల్గొన్నారు.

మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై చర్యలు


కొండమల్లేపల్లి, మార్చి 26(ఆంధ్రజ్యోతి): బాలురు వాహనాలు నడపవద్దని, మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై చర్యలు తీసుకుంటామని కొండమల్లేపల్లి ఎస్ఐ రాంమూర్తి అన్నారు. బుధవారం కొండమల్లేపల్లి పోలీస్‌స్టేషన్‌లో డ్రైవింగ్ లైసెన్స్‌లు, అనుమతులు లేకుండా వాహనాలు నడపుతున్న మైనర్లకు కౌన్సిలింగ్ ఇచ్చారు. మైనర్లు వాహనాలు నడపడంవల్ల ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని, దీంతో ఎంతోమంది అమాయకులు బలవుతున్నారన్నారు. మైనర్లకు వాహనాలు ఇచ్చి ప్రోత్సహిస్తే తల్లిదండ్రులపై చర్యలు చేపడుతామని ఎస్ఐ తెలిపారు.

పంటలు ఎండుతున్నయ్

(5వపేజీ తరువాయి)

నీరు అధికంగా ఉండడంతో ఎక్కువ మంది రైతులు బత్తాయి తోటలను తొలగించి వరి సాగు చేశారు. ప్రస్తుతం వరదకాల్వకు నీటి విడుదల నిలిపివేయడంతో సాగునీరు అందక వరి చేలు ఎండిపోతున్నాయి. ఏప్రిల్ 15వరకు నీటి విడుదల ఉంటుందని ఆశతో అప్పు చేసి సాగు చేసిన వరి ఎండిపోతుండటంతో పెట్టుబడులు కూడా వచ్చే అవకాశం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. నీటి విడుదల కొనసాగించాలని ఇటీవల మాడ్గులపల్లి మండల కేంద్రంలోని అద్దంకి-నార్కట్‌పల్లి రహదారిపై రైతులు ధర్నా నిర్వహించారు. నీటి విడుదల చేయకపోతే మండలంలోని వరదకాల్వ కింద సాగు చేసిన సుమారు 1,000 ఎకరాల్లో పంటలు ఎండిపోతాయని నారాయణపురం, మర్రిగూడెం గ్రామాల రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నీటి విడుదల చేయాలని కోరుతున్నారు.

ఏప్రిల్ 15వరకు నీటి విడుదల కొనసాగించాలి



వరదకాల్వకు ఏప్రిల్ 15వరకు నీటి విడుదల కొనసాగించాలి. నేను నాలుగు ఎకరాల్లో వరి సాగుచేశా. పది రోజులకుపైగా నీరు రాకపోవడంతో చేను ఎండిపోతోంది. వరదకాల్వకు నీరు రాకపోవడంతో భూగర్భజలాలు సైతం అడుగంటాయి. నీటిపారుదలశాఖ అధికారులు, ప్రభుత్వం స్పందించి ఏప్రిల్ 15వరకు వరదకాల్వ ద్వారా నీటిని విడుదల చేసి ఎండుతున్న పంటలను కాపాడాలి.

మైలవరపు కనకారెడ్డి, రైతు, కుక్కడం

సాగర్ సీఐగా శ్రీను బాధ్యతల స్వీకరణ


సీఐ శ్రీను నాయక్

నాగార్జునసాగర్, మార్చి26 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ సర్కిల్ నూతన సీఐగా శ్రీను నాయక్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పనిచేసిన సీఐ బీసన్న నల్లగొండ ఎస్పీ కార్యాలయానికి వెళ్లగా ఆయన స్థానంలో నూతన సీఐగా డీఎస్‌బీనుంచి శ్రీను నాయక్ పదవి బాధ్యతలు చేట్టారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

డిండి, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ఎలాంటి అనుమతులులేకుండా డిండి వాగు నుంచి ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను బుధవారం అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. ఉదయం 5 గంటల సమయంలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో మండలంలోని ప్రతాప్‌నగర్ గ్రామశివారులో రెండు ట్రాక్టర్లను అదుపులోకి తీసుకొని గోనబోయినపల్లి గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్లు మాడ్గుల అజయ్, ఉలుకుంద కృష్ణపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ధర్మభిక్షం ఆశయ సాధనకు కృషి చేయాలి

● సీపీఐ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు పల్లా నర్సింహారెడ్డి ● దేవరకొండలో ధర్మభిక్షం వర్దంతి సభ


ధర్మభిక్షం చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న పల్లా నర్సింహారెడ్డి, నాయకులు

దేవరకొండ, మార్చి 26(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ ఎంపీ దివంగత బొమ్మగాని ధర్మభిక్షం ఆశయ సాధనకు కృషి చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు పల్లా నర్సింహారెడ్డి అన్నారు. బుధవారం దేవరకొండలో ధర్మభిక్షం 14వ వర్ధంతిని పురస్కరించుకొని సీపీఐ, గీతాపనివార్ల సంఘం ఆధ్వర్యంలో ధర్మభిక్షం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి మాట్లాడారు. దున్నేవాడిదే భూమి, గీసేవాడికే చెట్టు అనే నినాదంతో ధర్మభిక్షం పేద, బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి పోరాటాలు చేశారన్నారు. గీతా కార్మికుల సమస్యల పరిష్కారానికి ధర్మభిక్షం చేసిన పోరాటం మరువలేనిదన్నారు. కార్యక్రమంలో గీతాపనివార్ల సంఘం డివిజన్ అధ్యక్షుడు కుంభం జయరాములు, సీపీఐ మండల సహాయకార్యదర్శి నూనె రామస్వామి, వలమాల ఆంజనేయులు, జూలూరి వెంకట్రాములు, నూనె వెంకటేశ్వర్లు, మైనొద్దిన్ తదితరులు పాల్గొన్నారు. దేవరకొండ మండలం తాటికోలులో ధర్మభిక్షం విగ్రహానికి బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.